
రాజమండ్రి గోదావరిలో నిమజ్జనం అవుతున్న గణనాథుడు

గణపతికి ఘన వీడ్కోలు

- ఊరేగింపులతో గోదావరి చెంతకు
- గోదారమ్మ ఒడిలోకి 700 గణనాథులు
- ఘనంగా సాగుతున్న గణపతి విగ్రహాల నిమజ్జనం



రాజమహేంద్రవరం సిటీ/కల్చరల్, సెప్టెంబరు 16: గణపతి నవరాత్రులు ముగిసిన సందర్భంగా జిల్లావ్యాప్తంగా రాజమహేంద్రవరం డివిజన్‌లోని పలు మండపాల్లో పూజలందుకున్న గణపతులకు భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. రాజమహేంద్రవరంలో ఉత్సవ కమిటీలు వారి గణపతుల విగ్రహాలను అలంకరించిన వాహనాల్లో పురవీధుల గుండా ఊరేగింపుగా గోదావరి బండ్ జీవకారుణ్య సంఘం ఎదురుగా ఉన్న ర్యాంప్ వద్దకు చేరుకున్నారు. అక్కడ పోలీసులు, నగరపాలక సంస్థ అధికారుల సమన్వయంతో ర్యాంప్‌లోకి ఒక్కొక్క వాహనాన్ని ఇద్దరు కమిటీ సభ్యులను అనుమతించి క్రేన్ సహకారంతో పంటులోకి విగ్రహాలను చేర్చి నది మధ్యలోకి తీసుకెళ్లి గోదావరిలో మునిసిపల్ సిబ్బందే నిమజ్జనం చేశారు. దీనిని పెద్దఎత్తున గోదావరి బండ్ రోడ్డు పైనుంచి భక్తులు తిలకించి గణపతికి వీడ్కోలు పలికారు. రాజమహేంద్రవరం పరిసర గ్రామాల్లో మొత్తం 1500 విగ్రహాలు భక్తుల పూజలు అందుకున్నాయి. వాటిలో మూడ్రోజులుగా 700 విగ్రహాలు గోదావరి ఒడిలోకి చేరాయి. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు 80 విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఇంకా సుమారు 800 విగ్రహాలు నిమజ్జనం కావాల్సివుంది. మంగళ, బుధవారాల్లో పెద్దఎత్తున గణపతి విగ్రహాల నిమజ్జనం కొనసాగనుంది. విగ్రహాల నిమజ్జనంలో ఎటువంటి అపశృతులు జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. నవరాత్రుల ముగింపు సందర్భంగా లడ్డూ వేలం, అన్నదానాలు జరిగాయి. జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ పాల్గొని భోజనాలు వడ్డించారు. రాజమహేంద్రవరం పుష్కర్‌ఘాట్ వద్ద సృష్టి గణపతి స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూర్ణాహుతి హోమం కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





ఉచిత ఇసుక సరఫరాకు

పకడ్బందీ ప్లాన్

రవాణా చార్జీల నిర్ణయం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఉచిత ఇసుక పథకాన్ని పకడ్బందీగా అమలుచేయడానికి ప్రణాళికను సిద్ధంచేసింది. కేవలం ఇసుకతీత, ఎగుమతి, పరిపాలనాపరమైన చార్జీలు, రవాణా చార్జీలతోనే ఇసుకను లబ్ధిదారులకు చేరేలా చేయడం ప్రభుత్వ లక్ష్యం. ఇసుక తవ్వకం, లోడింగ్ రూ.30, రీలోడింగ్‌కు రూ.30, సీనరేజి రూ.66, జీఎస్టీ 18శాతం, డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ (డీఎంఎఫ్) రూ.19.68, మెరిట్ (ఖనిజాన్వేషణ నిధి) 2 శాతం వసూలుచేస్తారు. ఇవికాకుండా లబ్ధిదారుడు రవాణా చార్జీలు పెట్టుకోవాలి. ఇక ర్యాంపుల్లో ఒక పైసా కూడా అదనంగా తీసుకోవడానికి వీలులేదు. కానీ కొందరు రవాణా చార్జీల పేరిట ఎక్కువ వసూలు చేస్తున్నట్టు స్టాక్ పాయింట్లలో తేలడంతో రవాణాచార్జీలను ప్రభుత్వమే నిర్ణయిస్తూ జీవో జారీచేసింది. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారమే ఇసుక రవాణాచేసే వాహనదారులు ఇసుకను సరఫరా చేయాలి. ఇసుక ర్యాంపు నుంచి 10 కిలోమీటర్ల వరకూ 4.5 టన్నుల ట్రాక్టర్‌కు రూ.13.5 రవాణా చార్జీ నిర్ణయించారు. తర్వాత 11 నుంచి 20కిలోమీటర్ల వరకూ రూ.12.8, 21 నుంచి 30 కిలోమీటర్ల వరకూ రూ.12.8, 31నుంచి 40 వరకూ రూ.12.8, 40 నుంచి 80 కిలోమీటర్ల వరకూ రూ.6.3 మాత్రమే వసూలు చేయాల్సి ఉంది. 10 టన్నుల ఇసుక తీసుకుని వెళ్లే ఆరు టైర్ల ట్రక్కుకు ఇసుక పాయింట్ నుంచి 10 కిలోమీటర్ల రూ.10.7, తర్వాత 11 నుంచి 20 కిలోమీటర్ల వరకూ రూ.10.2 తర్వాత 21 నుంచి 30 కిలోమీటర్ల వరకూ 10.2 రూపాయలు, 31 నుంచి 40 వరకూ రూ.10.2, తర్వాత 40 నుంచి 80 కిలోమీటర్ల వరకూ రూ 6.3, వసూలు చేయాలి. 10, 12, 14 టైర్ల లారీలు 18 టన్నులు ఇసుక తీసుకుని వెళ్లినా, 20 టన్నులు, 25 టన్నులు, 30 టన్నులు, 35 టన్నుల ఇసుక తీసుకుని వెళ్లినా పాయింట్ నుంచి 10 కిలోమీటర్ల వరకూ కిలోమీటరు రూ.9.4, తర్వాత 11 నుంచి 20 కిలోమీటర్ల వరకూ రూ.8.9, 21 నుంచి 30 కిలోమీటర్ల వరకూ రూ.8.9, 31 నుంచి 40 కిలోమీటర్ల వరకూ రూ.8.9, 40 నుంచి 80 కిలోమీటర్ల వరకూ రూ.6.3 వసూలు చేయాల్సి ఉంటుంది. ఇక 80 కిలోమీటర్లకంటే ఎక్కువ దూరం ఉంటే కిలోమీటరుకు రూ.35 అదనంగా వసూలు చేయవచ్చని నిర్ణయించారు. ఇవన్నీ సక్రమంగా అమలైతే చాలా తక్కువకే ఇసుక వినియోగదారుడికి అందుతుంది. ఇంతవరకూ వరదల వల్ల ఇసుకతీత ఆగింది. నెమ్మదిగా వరద లాగేస్తోంది కాబట్టి త్వరగానే ఇసుకతీత మొదలుకానుంది.



డబ్బు కొట్టు సీటు పట్టు!

- పోలీసు శాఖలో బదిలీల పందేరం
- ఆరోపణలున్నా కోరుకున్న చోటికే
- జిల్లా బాస్ ఒప్పుకోక తప్పని పరిస్థితి
- వీఆర్, లూప్‌ల వాళ్లకు దక్కని అవకాశం
- అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీల సీట్లు ఖాళీ
- ఇంకా పూర్తిగా భర్తీకాని సీఐ స్థానాలు
- అధికార కూటమిలో.. అనధికార వైసీపీ హవా
- సీఎం చంద్రబాబు సమీక్షించాలని వేడుకోలు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వం పోలీసులను ఎంత దారుణంగా సొంత పనులకు వాడుకుందో ప్రజలకు తెలిసిందే. అప్పుడు రూల్ ప్రకారం నడుచుకున్న వాళ్లంతా కూటమి ప్రభుత్వం వచ్చాక కాస్త సాంత్వన చెందారు. తమకు ప్రాధాన్యం ఇస్తారని అనుకొన్నారు. కానీ వాస్తవం భిన్నంగా ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక పోలీస్ వ్యవస్థలో సమూల ప్రక్షాళన చేపట్టింది. దీనిలో భాగంగా నిజాయితీ అధికారిగా పేరున్న సీహెచ్ ద్వారకాతిరుమలరావును ఏరికోరి రాష్ట్ర పోలీస్ బాస్‌గా నియమించింది. తర్వాత బదిలీల తంతు మొదలైంది. ముందుగా రాష్ట్ర స్థాయిలో బదిలీలు చేపట్టారు. తర్వాత జిల్లా అధికారుల వంతు వచ్చింది. ఈ 'తతంగం' అంతా పైస్థాయిలో జరగడంతో కొందరు వైసీపీ మనుషులు కూడా సందట్లో సడేమియాగా మంచి స్థానాలు దక్కించుకున్నారనే విమర్శలు ఉన్నాయి. తర్వాత సీఐలు, ఎస్‌ఐల బదిలీలు చేపట్టారు. వీరిని బదిలీ చేసే అధికారం రేంజ్ డీఐజీకి ఉంటుంది. ప్రస్తుతం ఏలూరు రేంజ్ ఐజీగా అశోక్‌కుమార్ ఉన్నారు. ఆయనకు మంచి అధికారిగా పేరుంది. ఈనేపథ్యంలో బదిలీల్లో చేతులు మారుతున్న రొక్కం ఎవరి జేబుల్లోకి వెళుతోందనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. జిల్లాలోని ఇటీవల జాయిన్ అయిన ఓ సీఐకి కీలకమైన స్టేషను ఇవ్వడానికి నిజాయితీ గల జిల్లా ఉన్నతాధికారి నిరాకరించారని సమాచారం. అయితే ఓ ప్రజాప్రతినిధి పైస్థాయిలో తీవ్ర ఒత్తిడి తీసుకురావడంతో ఆ ఉన్నతాధికారి మెత్తబడక తప్ప లేదని చెబుతున్నారు. ప్రజలను గత వైసీపీ పాలకుల దాష్టీకాల నుంచి బయటకు తీసుకొచ్చి సుపరిపాలన అందించాలని కూటమి పెద్దలు శ్రమిస్తుంటే కింది స్థాయిలో.. అదీ రోజూ ప్రజలతో నేరుగా సంబంధాలు ఉండే ఇలాంటి పోస్టులు డబ్బుకు దాసోహం కావడంపై తీవ్రస్థాయిలో విమర్శలు ఉన్నాయి. దీంతో పోలీసు శాఖలోని పోస్టింగులను సీఎం లేదా డిప్యూటీ సీఎం స్థాయిలో పునఃసమీక్షించాలనే చర్చ నడుస్తోంది. లేదంటే పోలీస్ బదిలీలు ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే అవకాశం ఉందనే వాదన వినవస్తోంది.

కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి మూడు నెలలు దాటింది. అయినా పోలీస్ శాఖలో బదిలీల పందేరం సా..గుతూనే ఉంది. డబ్బు కొట్టిన వాళ్లకే సీట్లు దక్కుతున్నాయనే వాదన పెద్ద ఎత్తున వినవస్తోంది. గతంలో పని చేసిన చోట పలు ఆరోపణలు ఎదుర్కొన్న వారు సైతం మళ్లీ అదే స్థానం దక్కించుకోవడం దానికి బలాన్ని చేకూరుస్తోంది. పైగా వైసీపీకి తమ వంతు సాయం చేసిన వాళ్లకూ మంచి పోస్టింగులే వచ్చాయి. వీఆర్, లూప్‌లైన్లలో ఏళ్ల తరబడి చేసిన వాళ్లకు అసలు లా అండ్ ఆర్డర్ విభాగంలో పోస్టింగులు దక్కడం లేదనే చర్చ ఆ శాఖ వర్గాల్లో నడుస్తోంది. కూటమి వచ్చిన తర్వాత తమకు అవకాశం దక్కుతుందని ఆశగా ఎదురు చూసిన వారికి నిరాశే మిగులుతోంది. ఈ పరిస్థితుల్లో పోలీసు బదిలీల్లో ఏంటీ గందరగోళం? అసలు ప్రభుత్వానికి ఈ తంతు తెలుస్తోందా? అనే మీమాంశ నెలకొంది. డబ్బులిచ్చి పోస్టింగ్ తెచ్చుకున్న వాళ్లు సొంపాదనకు మొగ్గు చూపకుండా పేదోళ్ల పక్షాన ఉంటారా? అనే ప్రశ్న జనుల నుంచి గట్టిగా వినబడుతోంది.

● ఉన్నతాధికారులు ఏరీ?

జిల్లాలోని ఎస్సీ ఎస్టీ సెల్, దిశ, రాజమహేంద్రవరం డివిజన్లో ఈస్ట్, వెస్ట్, సౌత్, నార్త్, కొవ్వూరు డివిజన్‌లో కొవ్వూరు సబ్-డివిజన్ తదితర విభాగాల్లో డీఎస్పీలు ఉన్నారు. జిల్లా స్థాయిలో ఎస్పీ పోలీస్ బాస్ కాగా.. క్రైమ్స్, పరిపాలన, శాంతి భద్రతలు, ఏఆర్ విభాగాలకు అడిషనల్ ఎస్పీలు ఉన్నారు. వీరంతా పర్యవేక్షణ అధికారుల పరిధిలోకి వస్తారు. ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు మార్పులు జరిగాయి. అయితే తర్వాత కూటమి ప్రభుత్వం వచ్చాక జరిగిన బదిలీల్లో ఎన్నికల కోటాలో వచ్చిన వారు వెనక్కు వెళ్లగా.. కొందరిని మార్పు చేశారు. ఇప్పటికీ కీలకమైన స్థానాలు ఖాళీగానే ఉన్నాయి. క్రైమ్స్, పరిపాలన విభాగాల అడిషనల్ ఎస్పీ సీట్లు భర్తీ చేయలేదు. కీలకమైన ఎస్‌బీ, క్రైమ్స్ డీఎస్పీలు, ఎస్సీఎస్టీ సెల్, ఈస్ట్, నార్త్ జోన్ల డీఎస్పీ స్థానాల్లో ఇంచార్జిలు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ పోస్టుల్లో అధికారులు రావడానికి ట్రయల్స్‌లో ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. ఇలా సమర్థత ఆధారంగా కాకుండా డబ్బు బరువుతో పోలీస్ పోస్టింగులను తూకం వేస్తుండడం చూస్తుంటే రానున్న రోజుల్లో అభాగ్యులకు వీళ్లు నిజాయితీగా ఎంత వరకూ న్యాయం చేస్తారో వేచి చూడాల్సిందే.

● ఇదీ తంతు..

జిల్లాలో 25 పోలీస్ స్టేషన్లుండగా వివిధ విభాగాలతో కలిపి 29 మంది సీఐలను జిల్లాకు కేటాయించారు. రాజానగరం, నల్లజర్ల, కొవ్వూరు టౌన్, రాజమహేంద్రవరంలోని వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్, ప్రకాశంనగర్, రూరల్‌లోని బొమ్మూరు స్టేషన్లకు సీఐలు ఎస్‌హెచ్‌వోలుగా ఉన్నారు. మిగతా పోలీస్ స్టేషన్లలో ఎస్‌ఐలు ఎస్‌హెచ్‌వోలుగా ఉన్నారు. జిల్లాలో కొవ్వూరు రూరల్, కోరుకొండ, దేవరాపల్లి, అనపర్తి, నిడదవోలు సర్కిళ్లు ఉన్నాయి. అయితే వీటిలో చాలా స్టేషన్లలో 'ట్రై' చేసుకున్న వాళ్లే ఉన్నారని చెబుతున్నారు. ఇప్పటికీ వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్ క్రైం స్టేషన్లకు సీఐలు లేరు. ఈ మూడింటికీ వీఆర్‌లో ఉన్న ఒక సీఐ 'అందాక' బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అలాగే రోడ్డు ప్రమాదాల జాబితాలో ముందుండే దేవరాపల్లి స్టేషనుకు రెగ్యులర్ సీఐ లేరు. ఈ స్టేషను బాధ్యతనూ వీఆర్‌లో ఉన్న సీఐ తాత్కాలికంగా చూస్తున్నారు. అసలే జిల్లా కేంద్రంలో అస్తవ్యస్తమైన ట్రాఫిక్‌ని దారిలో పెట్టడం ఎవరి తరమూ కావడం లేదు. దీనికితోడు ఇప్పుడు ట్రాఫిక్ సీఐ కూడా లేరు. సాధారణంగా గతంలో పనిచేసిన స్టేషనులో ఆరోపణలు ఉంటే మళ్లీ అదే స్టేషనులో పోస్టింగు రావడం అత్యంత కష్టమని చెబుతారు. కానీ ఇప్పుడు ఆ పని 'సొమ్ము'తో సులభంగా జరిగిపోతోందనే ఆరోపణలు ఉన్నాయి. తీవ్రమైన ఆరోపణల వల్ల ఎన్నికల కౌంటింగ్‌కి రెండు రోజుల ముందు కొవ్వూరు డీఎస్పీ, అదే కార్యాలయంలో తిష్ట వేసిన ఏఎస్‌ఐపై కఠిన చర్యలు తీసుకొన్నారు. డీఎస్పీకి ఉన్నతాధికారులు ఉద్వాసన పలికారు. ఎక్కడా పోస్టింగు ఇవ్వకుండా డీజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఏఎస్‌ఐని దేవరపల్లి బదిలీచేశారు. కానీ కొవ్వూరు వీడడం సుతరామూ ఇష్టం లేని ఆ ఉద్యోగి మళ్లీ ఇప్పుడు కొవ్వూరు టౌన్ పీఎస్‌కి బదిలీ చేయించుకొన్నారు. బదిలీల గోల్‌మాల్‌కి ఇదో ఉదాహరణని ఆ శాఖలో అంతర్గతంగా గుసగుసలు వినవస్తున్నాయి. దీంతో విధి నిర్వహణలో చావును అంగుళం దూరంలో చూసి, ధైర్యసాహసాలకు రాష్ట్రపతి మెడల్స్ సంపాదించిన వారు, ఏళ్ల తరబడి జిల్లా పోలీసు కార్యాలయంలో.. ఇతర లూప్‌లైనులో మగ్గిపోతున్నవారు ఖర్చు పెట్టుకోలేక స్టేషన్లను అందుకోలేకపోవడం నిజాయితీని ప్రశ్నిస్తోంది. వైసీపీకి కొమ్ముకాసిన వారికి మంచి పోస్టింగులు రావడంతో వైసీపీ హవానే కొనసాగే ప్రమాదం ఉందని, అందువల్ల బదిలీలపై సీఎం చంద్రబాబు దృష్టి సారించి సమీక్షించాలనే డిమాండ్లు వినవస్తున్నాయి. కూటమి ప్రజాప్రతినిధులకు ఈ పోస్టింగుల్లో మతలబులు ఎందుకు తెలియడం లేదనే అనుమానం కూడా నడుస్తోంది.

● అయోమయంలో కింది సిబ్బంది

తమకు బదిలీలు ఎప్పుడా అని కానిస్టేబుల్ నుంచి ఏఎస్‌ఐ కేడర్ వరకూ ఎదురు చూస్తున్నారు. జిల్లాలో 900 మంది ఆ స్థాయి సిబ్బంది ఉండగా.. వారిలో ఐదేళ్లు దాటిన వారు సుమారు 200 మంది ఉండొచ్చు. వారి బదిలీలను ఇప్పటి వరకూ పట్టించుకోలేదు. ప్రస్తుతం పిల్లలకు స్కూలు ఫీజులు కట్టేయడం, తరగతులు ప్రారంభంకావడంతో కౌన్సెలింగ్ చేసి దూరాభారం కాకుండా సహేతుకంగా బదిలీలు చేయాలని కోరుకుంటున్నారు. అలాగే ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి విషయంలో కఠినంగా ప్రవర్తించాలని విన్నవిస్తున్నారు. జగదీశ్ ఎస్పీగా ఉన్నప్పుడు 120 మందితో బదిలీల జాబితా సిద్ధమైంది. తర్వాత ప్రభుత్వం మారాక, డీజీపీగా ద్వారకా తిరుమలరావు పగ్గాలు చేపట్టిన తర్వాత వాటిని ఆపాలని ఉత్తర్వులు రావడంతో బదిలీల్లేవు.

● ఎక్సైజ్ వంతు

సెబ్‌ని రద్దు చేసే ప్రక్రియలో ఉండడం, కొత్త మద్యం పాలసీపై సమావేశాల వల్ల ఎక్సైజ్ బదిలీల్లో కొంత జాప్యం జరిగింది. సెబ్‌ని రద్దు చేయడం వల్ల మాతృశాఖ అయిన ఎక్సైజ్‌కి జిల్లాలో 80 మంది వెనక్కి వచ్చారు. ఎక్సైజ్‌లో పూర్తి స్థాయిలో బదిలీలు జరగాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఇప్పుడు ఆ శాఖ అధికారులు, సిబ్బంది 'దారు'ల వెతుకులాటలో పడ్డారు. ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారని తెలుస్తోంది. పోలీసు శాఖలోని తమకు పరిచయం ఉన్నవారు, స్నేహితుల నుంచి 'రేటు' ఎంతో సేకరించి ఆ దిశగా వెళుతున్నారని సమాచారం.


(రాజమహేంద్రవరం సిటీ)

రాజమహేంద్రవరం

సరికొత్తగా!

కొత్త మాస్టర్ ప్లాన్‌తో రహదారుల విస్తరణ

2027 పుష్కరాల నాటికి మహానగరంగా తీర్చిదిద్దే యోచన

ఏ నగరం అభివృద్ధి చెందాలన్నా ముందుచూపుతో తీసుకునే నిర్ణయాలే ఆధారమవుతాయి. సరైన ప్రణాళిక ఉంటేనే ఆ నగరం అందంగా, శుభ్రతకు మారుపేరుగా నిలుస్తుంది. అప్పటికప్పుడు తీసుకునే నిర్ణయాలతో అభివృద్ధి చేసుకుంటూపోతే నిష్ప్రయోజనమే. అందుకే పట్టణాలు, నగరాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ చాలా కీలకం. ఇప్పుడు చారిత్రాత్మక రాజమహేంద్రవరానికి నూతన రూపం తీసుకువచ్చేందుకు అధికార యంత్రాంగం ఈ దిశగా సన్నద్ధమవుతోంది. రాజమహేంద్రవరం నగరం వైశాల్యం 44.5 స్క్వేర్ కి.మీగా ఉంది. 50 డివిజన్లు, సుమారు 5 లక్షల మంది జనాభా, 600 కిలోమీటర్ల డ్రైనేజీ వ్యవస్థతో మహానగరంగా రాజమహేంద్రవరం ఉంది. చారిత్రక ప్రదేశాలను పరిరక్షిస్తూనే నగరాన్ని మరింత విస్తరించి మహానగరంగా మార్చే ఆలోచనకు అధికారులు కార్యరూపం దాల్చే ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు.

తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కేంద్రంగా ఉన్న రాజమహేంద్రవరం ప్రధానంగా వాణిజ్య నగరం. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలకు రాజమహేంద్రవరం ముఖ్య నగరం కూడా. అటు విజయవాడ, ఇటు విశాఖపట్నం నగరాలకు మధ్యలో ఉన్న రాజమహేంద్రవరం అభివృద్ధిలో ముందుకు దూసుకుపోయే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. చుట్టుపక్కల సుమారు 15 గ్రామాలను నగరంలో విలీనం చేసి నగర విస్తరణను పెంచుతూ రాజమహేంద్రవరానికి మరింత శోభ వచ్చే విధంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ దిశగా రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగాన్ని కమిషనర్ కేతన్ గార్గ్ సన్నద్ధం చేశారు. ఇందులో భాగంగా రాజమహేంద్రవరానికి 2017లో రూపొందించిన నూతన మాస్టర్ ప్లాన్‌ను టౌన్ ప్లానింగ్ అధికారులు అమలుచేయబోతున్నారు. ఈ ప్లాన్ ప్రకారం నగరంలో చాలా రహదారులు వెడల్పుచేయాల్సి ఉంది. గత ప్రతిపాదనలతోపాటు కొత్తగా అనేక రహదారులను అభివృద్ధి చేసేందుకు అధికారులు సిద్ధమతున్నారు. నగరంలో ఆలకట్ గార్డెన్స్, ఈస్ట్ రైల్వేస్టేషన్ మొదలుకొని దానికి అనుసంధానంగా ఉన్న రహదారులన్నీ వెడల్పుచేసి అభివృద్ధి చేసే ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. అదేవిధంగా జాతీయ రహదారి నుంచి రాజమహేంద్రవరంలోకి వచ్చే అన్ని ప్రధాన రహదారులను విస్తరించబోతున్నారు.

● తూర్పు రైల్వేస్టేషన్ నుంచి..

రాజమహేంద్రవరంలో ప్రధాన రైల్వేస్టేషన్ నగరానికి పడమర వైపు ముఖంగా ఉంది. తూర్పువైపున ఉన్న ఈస్ట్ రైల్వే స్టేషన్‌ను మరింతగా అభివృద్ధి చేయడంలో భాగంగా సుమారు రూ.270 కోట్లు కేంద్ర ప్రభుత్వ రైల్వే నిధులతో రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ రూపురేఖలు మార్చబోతున్నారు. తూర్పు నుంచి ఈ స్టేషన్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తే దానికి అవసరమయ్యే రహదారులను నిర్మించేందుకు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్లను వెడల్పుచేసి వాటిని జాతీయ రహదారికి, నగరంలోకి అనుసంధానం చేసేందుకు రహదారుల విస్తరణ చేయబోతోంది. ఆలకట్ గార్డెన్స్ నుంచి పేపరు మిల్లు వరకు ఆయా రహదారులను వెడల్పు చేయబోతోంది.

● 2027 పుష్కరాల నాటికి తీర్చిదిద్దేలా..

ప్రతి 12 ఏళ్లకు ఒకసారి వచ్చే గోదావరి పుష్కరాలకు రాజమహేంద్రవరాన్ని మరింతగా అభివృద్ధి చేసి మహానగరంగా తీర్చిదిద్దే ఆలోచనతో అధికారులు ముందుకు సాగుతున్నారు. నగరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, రహదారులు, ట్రాఫిక్ నియంత్రణ, దేవాలయాల సముదాయాల అభివృద్ధి, పర్యాటక అభివృద్ధి.. ఇలా అన్నింటిని దృష్టిలో పెట్టుకుని 2027 నాటికి రాజమహేంద్రవరాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. నూతన మాస్టర్ ప్లాన్ ప్రకారం ప్రతీ కూడలి, ప్రతీ రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థను విస్తరిస్తూ అభివృద్ధిపరచాలని భావిస్తున్నారు. ముఖ్యంగా అంతర్గత రహదారులు వెడల్పు చేయాలని, నగరంలో విపరీతంగా పెరిగిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేవిధంగా ఆక్రమణలు తొలగించాలని నిర్ణయించారు.

● 2017 మాస్టర్ ప్లాన్ ప్రకారం రహదారుల వెడల్పు

రాజమహేంద్రవరం నగరంలో 2017లో రూపొందించిన నూతన మాస్టర్ ప్లాన్ ప్రకారం నగరంలో రహదారులు వెడల్పు చేసేందుకు అప్రూవల్ తీసుకోవాలి. అందుకు సన్నద్ధమవుతున్నాం. అటు ఆల్కాట్ గార్డెన్స్ మొదలుకొని ఈస్ట్ స్టేషన్, బాలాజీపేట రోడ్డు, జాతీయ రహదారికి ఇటు ఆవ రోడ్డు మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు, మునిసిపల్ స్టేడియం రోడ్డు, గోదావరి రేవులకు వెళ్లే ప్రతి రహదారులను వెడల్పుచేస్తాం. పేపరుమిల్లు వరకు ఈ రహదారులు విస్తరణ ఉంటుంది. 40 అడుగులు, 60 అడుగులు, 80 అడుగులు రహదారుల వెడల్పుల పనులు ప్రభుత్వ అనుమతులతో పూర్తి చేయాల్సి ఉంది.

- జీవీఎస్ఎన్ మూర్తి, సిటీ ప్లానర్, రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ



బాణసంచా పేలి 17 మందికి గాయాలు

ఇద్దరి పరిస్థితి విషమం

అమలాపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణ ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పట్టణంలోని రావుల చెరువులో సోమవారం ఉదయం 9.45 గంటలకు బాణసంచా తయారు చేస్తున్న ఓ ఇల్లు పేలుడు ధాటికి తునాతునకలై కుప్పకూలిపోయింది. పక్కనే ఉన్న ఇల్లు కూడా ధ్వంసమైంది. విస్ఫోటనంలో గొవ్వాల నాగేశ్వరరావు, గొవ్వాల సుభద్రమ్మలకు చెందిన ఇల్లు పూర్తిగా ధ్వంసమైనట్టు రెవెన్యూ అధికారులు రికార్డు చేశారు. వాటితోపాటు సమీపంలోని పలు ఇళ్లు స్వల్పంగా దెబ్బతిన్నాయి. పలు చోట్ల టీవీలు ధ్వంసమయ్యాయి ఈ ఘటనలో మొత్తం 17మంది గాయపడగా, తొమ్మిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. బాణసంచా తయారు చేస్తున్న గొవ్వాల నాగేశ్వరరావు పరిస్థితి విషమంగా ఉంది. ఆయన భార్య నాగలక్ష్మి (55) తలకు బలమైన గాయంకావడంతో మంగళవారం ఉదయం శస్త్రచికిత్స నిర్వహించనున్నారు.

పోలవరం ప్రాజెక్టుపై మరో శ్వేతపత్రం విడుదల చేయాలి

అక్టోబరు 3న గ్రామసభలు నిర్వహించాలి

ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారు అయినాపురపు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 16: పోలవరం ప్రాజెక్టు అంచనాలు పెరిగిన నేపథ్యంలో సీఎం చంద్రబాబు మరో శ్వేతపత్రం విడుదలచేయాలని ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారులు అయినాపురపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2020 ఫిబ్రవరి 29న పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు చీఫ్‌ఇంజనీర్ బి.సుధాకర్‌బాబు కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో ఎస్టీలు 56,495, ఎస్సీలు 7,134, ఓబీసీలు 34,266, ఓసీలు 7706 కలిపి మొత్తం 10560 కుటుంబాల నిర్వాసితులు అవుతున్నారన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి వ్యక్తి ఒక కుటుంబంగా కొత్త భూసేకరణ చట్టం పేర్కొందని, 2024 నాటికి 14 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి ఇప్పుడు 18 ఏళ్లు పూర్తిచేసుకుని కుటుంబంగా పరిగణించబడతారని తెలిపారు. కానీ సీఎం చంద్రబాబు విడుదల చేసిన శ్వేతపత్రంలో నిర్వాసితుల సంఖ్య 96,660గా వెల్లడించారని అంటే 10 వేల కుటుంబాలను తగ్గించి చూపించారన్నారు. అక్టోబరు 3న పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ముంపు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని కోరారు.

సమయం : సోమవారం
ఉదయం 9.45 గంటలు..
అమలాపురం పట్టణంలోని 30వ వార్డు పరిధి రావులచెరువులో బాణసంచా తయారీదారుడు గొవ్వల నాగేశ్వరరావు నివాసం..
అందరూ ఎవరి పనుల్లో వారు బిజీగా ఉన్నారు.. ఒక్కసారిగా భయంకరమైన శబ్దంతో పేలుడు.. మంటలు.. దట్టమైన పొగ.. ఏం జరిగిందోనని అంతా అలజడి.. పేలుడు ధాటికి ఇంటి పైకప్పు, గోడలు కుప్పకూలాయి.. ఇంట్లో ఉన్న వారందరూ బయటకు పరుగులు పెట్టి ప్రాణాలు కాపాడుకోగా.. మోటారు సైకిళ్లు గాలిలోకి ఎగిరి రోడ్డున పడ్డాయి. రోడ్డుపై వెళ్లే వారికి.. చుట్టుపక్కల ఉన్న వారికి కూడా గాయాలయ్యాయి.. మొత్తం 17 మందికి గాయాలు కాగా.. అందులో తొమ్మిది మంది తీవ్రం గాయపడ్డారు. ఈ ఘటనతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉలిక్కిపడింది.



బాధసంచా..

పేలుడు ధాటికి ధ్వంసమైన గొవ్వాల సుభద్రమ్మకు చెందిన డాబా గోడ





తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చేరిన నాగేశ్వరరావు, నాగలక్ష్మి

- ఇంట్లో బాణసంచా తయారు చేస్తుండగా పేలుడు
- కుప్పకూలిన ఇల్లు, గాల్లోకి ఎగిరిన మోటారు సైకిళ్లు
- మొత్తం 17 మందికి గాయాలు
- 9 మందికి తీవ్ర గాయాలు.., ఇద్దరి పరిస్థితి విషమం
- ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు
- గ్యాస్ లీక్ వల్లే పేలుడు : మంత్రి వాసంశెట్టి సుభాష్

అమలాపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బాణసంచా తయారీదారుడైన గొవ్వల నాగేశ్వరరావు(62) కొంత కాలంగా ఇంట్లోనే బాణసంచా తయారుచేస్తూ విక్రయాలు చేస్తున్నాడు. నివాస గృహాల మధ్య తయారుచేయడం ప్రమాదకరమని చుట్టుపక్కల వారంతా రెండు, మూడు పర్యాయాలు అతడికి చెప్పినావారి మాటలను లక్ష్య పెట్టలేదు. సోమవారం ఉదయం గ్యాస్ లీకై బాణసంచా సామగ్రి అంటుకుని విస్ఫోటం సంభవించినట్టు బాధిత కుటుంబీకులు చెబుతున్నారు. ఇక్కడ వద్దని వారించినా వినకుండా తయారు చేయడం వల్లే ఈ ఘోరం జరిగిందని చుట్టుపక్కల వారు పోలీసు అధికారుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావుకు చెందిన భవనం పూర్తిగా కుప్పకూలింది. పక్కనే నివాసమున్న గొవ్వాల సుభద్రమ్మ ఇంటి గోడ పూర్తిగా ధ్వంసమైంది. అయితే సుభద్రమ్మ అంతకు ముందే పొలం వద్దకు వెళ్లడంతో బతికి బయటపడింది. పక్కింట్లో దుస్తులు ఉతుక్కుంటున్న దూనబోయిన సుబ్బలక్ష్మికి గాయాలయ్యాయి. రోడ్డుపై వెళ్లేవారు, దగ్గరలో ఆడుకుంటున్న పిల్లలకి కూడా శకలాలు తగలడంతో గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. ఇంట్లో గ్యాస్ లీకై బాణసంచా పేలుడు సంభవించిందని కొందరు, బాణసంచా తయారు చేస్తున్న సమయంలోనే ఈ పేలుడు సంభవించి నల్లని పొగ ఆకాశంలోకి ఎగిసి పడడంతో ఆ ప్రాంత ప్రజలందరూ అయోమయానికి గురయ్యారనేది మరికొందరి ఆరోపణ.

క్షతగాత్రులు వీరే..

బాణసంచా విస్ఫోటంలో గొవ్వాల నాగేశ్వరరావు (62), నాగలక్ష్మి(55)లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరి కుమారుడు గొవ్వాల యల్లీష్‌రాజు (25), యానాంకు చెందిన కుమార్తె కట్టా వేణు (35), మనుమడు వెంకట్, పక్కపక్క ఇళ్లకు చెందిన చొల్లంగి మారుతిసుబ్రహ్మణ్యం (20), పితాని శాంతి(26), బొక్కా మోహనప్రియ (11), దూనబోయిన సుబ్బలక్ష్మి (45), బొక్కా గీత గాయాలపాలయ్యారు. వీరందరూ కిమ్స్, అమలాపురం ఏరియా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. బొక్కా మల్లి (12), పాటి దేవి (23), దూనబోయిన గాయత్రి(20), పాటి ప్రకాష్ (26), పాటి సుజాత(40), పాటి ప్రభాకరం(45)లకు స్వల్ప గాయాలు కాగా వారికి ప్రాథమిక చికిత్స నిర్వహించి ఇళ్లకు పంపేశారు.



రావులచెరువులో పేలుడు ధాటికి పూర్తిగా నేలమట్టమైన నాగేశ్వరరావు ఇల్లు

గ్యాస్ లీక్‌తో బాణసంచా పేలుడు : మంత్రి సుభాష్

రావులచెరువులో గ్యాస్ సిలిండర్ లీకవ్వడంతోనే బాణసంచా పేలుడు సంభవించిందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. పేలుడులో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించిన తర్వాత ఆయన ఘటనా స్థలాన్ని సందర్శించారు. దేవుడి దయ వల్ల ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదన్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. లైసెన్సు లేకుండా బాణసంచా తయారు చేసేవారిపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ప్రశాంత కోనసీమలో ఇటువంటి ఘటన జరగడం బాధాకరం. తక్కువ మోతాదుతో బాణసంచా తయారు చేసినా గ్యాస్ సిలిండర్ల ప్రభావం వల్ల భవనం నేలమట్టం అయ్యింది. ఆ చుట్టుపక్కల 150 మీటర్ల దూరం వరకు భవనాలు, అద్దాలు దెబ్బతిన్నాయి. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధితులకు వైద్య ఖర్చులు, ఇల్లు కోల్పోయిన వారికి నష్టపరిహారం అందజేస్తామని మంత్రి ప్రకటించారు. ఎక్కడైనా ఇళ్ల మధ్య బాణసంచా తయారుచేస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని అధికారులను కోరారు. మంత్రి వెంట పలువురు టీడీపీ, జనసేన నాయకులు ఉన్నారు.



పేలుడు ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మంత్రి సుభాష్

నలుగురు మైనర్ల అరెస్టు

10 ద్విచక్రవాహనాలు స్వాధీనం

కడియం, సెప్టెంబరు 16: మోటారుసైకిళ్ల దొంగతనం కేసులో నలుగురు మైనర్లను అరెస్టు చేసి వారిని రాజమహేంద్రవరం కోర్టుకు హాజరుపరుస్తున్నట్టు డీఎస్పీ భవ్యకిషోర్ తెలిపారు. సోమవారం కడియం పోలీస్‌స్టేషన్‌లో వారి వివరాలు మీడియాకు వెల్లడించారు. కడియం మండలంలో ఇటీవల జరుగుతున్న మోటారు సైకిళ్ల వరుస దొంగతనాలపై ప్రత్యేక పోలీసుబృందాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ నాగదుర్గాప్రసాద్‌కు వచ్చిన సమాచారం మేరకు చైతన్యనగర్ శివారు దాండుబాబు ఆలయం వద్దకు పోలీసుసిబ్బందితో వెళ్లగా నలుగురు మైనర్లు మోటారు సైకిళ్లపై అనుమానాస్పదంగా తిరుగుతుండగా వారిని విచారించారు. ద్విచక్ర వాహన పత్రాలు పరిశీలించగా.. అవి చోరీకి గురైన మోటారుసైకిళ్లుగా వాటిని గుర్తించి, వారిని కడియం పోలీస్‌స్టేషన్‌కు తరలించారన్నారు. పందలపాక, మామిడాడ గ్రామాలకు చెందిన కొంతమందితో బృందంగా ఏర్పడి కడియం, రాజానగరం, పెరవలి, పెద్దాపురం, సర్పవరం, రాజమహేంద్రవరం, యానాం పరిధిలో 10 ద్విచక్రవాహనాలు చోరీ చేసినట్టుగా గుర్తించామని వెల్లడించారు. అదుపులోకి తీసుకున్న నలుగురు మైనర్లపై కేసు నమోదు చేసి రాజమహేంద్రవరం కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. పోలీసుసిబ్బంది కె.సురేష్‌బాబు, ఎం.సురేష్‌కుమార్, జి.రవికుమార్, కేవీ లక్ష్మణ్, శివకృష్ణ, బీమారావు, వై.రాహుల్, యూ.నాగబాబుకుమార్‌లు పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

సత్య గృహోపకరణాల షోరూం ప్రారంభం

అందుబాటు ధరల్లో ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ వస్తువులు



షోరూం ప్రారంభించిన దృశ్యం

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 16: సత్య ఏజెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ వారి గృహోపకరణాలు షోరూం కాకినాడ టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎండీ జీఎం జాన్సన్ ఆన్ శ్రీయా, జీఎం సెంథిల్ కుమార్, ఆనంద్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యా అంటే సంతోషమని, కస్టమర్లకు నాణ్యమైన వస్తువు సరసమైన ధరలకు అందించి కస్టమర్లకు సంతోషాన్ని, నమ్మకాన్ని అందించడం సత్య సొంతమన్నారు. ప్రొడక్ట్ హెడ్ భరత్ మాట్లాడుతూ 34వ షోరూంను కాకినాడలో ప్రారంభించామన్నారు. దేశవ్యాప్తంగా 277 షోరూమ్‌లు ఉన్నాయని, రాష్ట్రంలో 34 షోరూమ్‌లు ఉన్నాయని అన్నారు. రూ.30వేల పైబడి కొనుగోలు చేసిన వారికి బంగారు కాయిన్ ఇస్తామన్నారు.

విద్యార్థినులతో గుంజీలు తీయించిన ప్రిన్సిపాల్

- 50 మంది గిరిజన గురుకుల విద్యార్థినులకు అస్వస్థత
- రంపచోడవరం గురుకుల కళాశాలలో ఘటన
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు
- విచారణకు ఆదేశించిన ఐటీడీఏ పీఓ

రంపచోడవరం, సెప్టెంబరు1: రంపచోడవరంలోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థినులు సుమారు 50 మంది సోమవారం అస్వస్థతకు గురై రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో చేరారు. కళాశాల ప్రిన్సిపాల్ క్రమశిక్షణ పేరుతో విద్యార్థినులతో పెద్ద ఎత్తున గుంజీలు తీయించడంతో వారందరూ అస్వస్థతకు గురయ్యారు. తమ పిల్లలు అస్వస్థతకు గురయ్యారనే సమాచారం తెలుసుకున్న విద్యార్థినుల తల్లిదండ్రులు హుటాహుటిన కళాశాలకు చేరుకొని అనారోగ్య కారణాలపై ఆరా తీయగా ప్రిన్సిపాల్ వేధింపులే కారణమని తెలిసింది. సీపీఎం జిల్లా కార్యదర్శి లోతారామారావు, నాయకులు మట్ల వాణిశ్రీ తదితరులు గురుకుల కళాశాలకు చేరుకుని అస్వస్థతకు గురైన విద్యార్థినులను అంబులెన్సులో రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఈ ఘటన గురించి తెలుసుకున్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం తక్షణం స్పందించి విచారణకు ఆదేశించారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి కూడా ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించారు. తర్వాత గురుకుల కళాశాలను కూడా పరిశీలించి అక్కడ విద్యార్థినులతో మాట్లాడారు.

వినాయకా.. వీడ్కోలికా..

గణపతి నవరాత్ర మహోత్సవాల సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో ఊరూరా.. వీధి వీధినా కొలువుదీర్చిన బొజ్జగణపయ్యలకు భక్తులు ఘన వీడ్కోలు పలికారు.. వెళ్లిరా వినాయకా అంటూ సాగనంపారు. తీన్‌మార్ డప్పుల మోత మధ్య ఘనంగా నదీ, సముద్రతీరాలు, కాలువల వద్దకు తీసుకువెళ్లారు. నిమజ్జన కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు.

- కాకినాడ, కోనసీమ, రాజమహేంద్రవరం



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం చాకలిపాలెంలో గణనాథుడిని రథంపై నిమజ్జనానికి తీసుకువెళుతున్న చిన్నారులు



కాకినాడలో నిమజ్జనానికి తరలుతున్న వినాయక విగ్రహాలు



రాజమహేంద్రవరం గోదారి గట్టు వద్ద వినాయక విగ్రహాలు



వినాయక నిమజ్జనాల వద్ద మహిళల నృత్యాలు



గోదావరి తీరాన గంగమ్మ ఒడిలోకి గణపయ్య..

చిక్కని చిరుత జాడ..

దివాన్‌చెరువు, సెప్టెంబరు16 : చిరుతపులి కదలికల జాడ సోమవారం ఎటువంటి సీసీ, ట్రాప్ కెమెరాల్లోనూ కనిపించలేదని జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.భరణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. చిరుతను ట్రాప్‌బోనులలో పట్టుకొనుటకు అదనపు బోనులను అమర్చి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ప్రజల నుంచి వచ్చిన సమాచారం మేరకు వెళ్లి తనిఖీ చేయగా ఎటువంటి ఆధారాలు లభించలేదని, ప్రస్తుతం నివాసప్రాంతాల్లో చిరుతపులి సంచరిస్తున్నట్లు నిర్ధారణ లేదని తెలిపారు. హౌసింగ్‌బోర్డు కాలనీ, ఆటోనగర్, దివాన్‌చెరువు అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో పిల్లలను సాయంత్రం ఆరు గంటలు దాటాక బయట తిరగకుండా చూడాలని తల్లిదండ్రులకు మరోసారి విజ్ఞప్తి చేశారు.

నరాలు తెగే ఉత్కంఠతో..

- ముగిసిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు
- ఓవరాల్ చాంపియన్‌షిప్ గుంటూరు జట్టు
- సీనియర్ స్ట్రాంగ్ మెన్‌గా యశ్వంత్

అమలాపురం టౌన్, సెప్టెంబరు 16: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం హెల్త్-ఫిట్‌నెస్ జిమ్, కోనసీమ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు ముగిశాయి. ఆదివారం అర్ధరాత్రి తర్వాత బహుమతి ప్రదానోత్సవ సభ నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు యెనుముల కృష్ణపద్మరాజు, వంటెద్దు వెంకన్నాయుడు, జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ముగింపు సభకు మెట్రోకెమ్ అధినేత నందెపు వెంకటేశ్వరరావు (బాలాజీ) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ పోటీల్లో గుంటూరు జట్టు ఓవరాల్ టీమ్ చాంపియన్‌షిప్ సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. విజయనగరం జట్టు ద్వితీయ స్థానం సాధించింది. హోరాహోరీగా సాగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సబ్ జూనియర్స్ బాలుర విభాగంలో స్ట్రాంగ్‌మెన్ టైటిల్ విన్నర్స్‌గా పి.జాన్‌బాబు (కృష్ణ), బి.యశ్వంత్‌కుమార్ (కోనసీమ), పి.దినేష్ (అనకాపల్లి) వరుస స్థానాలు సాధించారు. జూనియర్ మెన్ విభాగంలో ఎస్.శరత్ (పల్నాడు), ఎస్.బాలసాయిచరణ్ (అనకాపల్లి), జె.లవకుమార్ (అనకాపల్లి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. సీనియర్స్ విభాగంలో స్ట్రాంగ్ మెన్ విన్నర్‌గా కె.యశ్వంత్ (విశాఖ) నిలవగా కేవీవీఎస్పీ ప్రసాద్ (అనకాపల్లి) ద్వితీయ, ఎస్.శరత్ (పల్నాడు) తృతీయ స్థానాలు సాధించారు. మెన్స్ విభాగంలో వేర్వేరుగా నిర్వహించిన పోటీల విజేతల వివరాలతో పాటు టీమ్ చాంపియన్‌షిప్ ట్రోఫీలను బాలాజీ విజేతలకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మెట్ల రమణబాబు, అల్లాడ శరత్‌బాబు, యేడిద శ్రీను, చిక్కాల గణేష్, ఆశెట్టి ఆదిబాబు, వంటెద్దు బాబి, పప్పుల శ్రీరామచంద్రమూర్తి, చిక్కం రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



ఓవరాల్ టీమ్ చాంపియన్‌షిప్ సాధించిన గుంటూరు జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నందెపు బాలాజీ



స్ట్రాంగ్ మెన్ విన్నర్‌గా నిలిచిన యశ్వంత్

మనస్పర్థలొద్దు.. మనందరం ఒకటే

- కూటమి ఐక్యతను దెబ్బతీసే పనిలో దుష్టశక్తులు
- కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, సత్తిబాబు దంపతులతో మంత్రి వాసంశెట్టి సుభాష్

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 16: మనస్పర్థలు వద్దు.. మనందరం ఒకటేనని, కూటమి ఐక్యతను దెబ్బతీసేందుకు కొన్ని దుష్టశక్తులు పని చేస్తున్నాయని, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు అహర్నిశలు పాటుపడుతున్నారని, వారి స్ఫూర్తితోనే అందరూ కలసికట్టుగా కాకినాడ రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. సోమవారం ఆయన కాకినాడ రూరల్ మండలం వలసపాకలలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, సత్తిబాబు దంపతుల నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి పిల్లి దంపతులు మంత్రికి ఘనస్వాగతం పలికారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను పరిచయం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో మంత్రి సుభాష్ మాట్లాడారు. అనంతరం మంత్రి సుభాష్ విలేకరులతో మాట్లాడుతూ.. టీడీపీలో అత్యంత సీనియర్ నాయకులు పిల్లి దంపతులని, పార్టీ పొత్తులో భాగంగా కూటమి అభ్యర్థి గెలుపు కోసం విశేష కృషి చేశారన్నారు. పార్టీ కష్టకాలంలో టీడీపీ వెన్నంటే ఉన్న చరిత్ర పిల్లి దంపతులదని కొనియాడారు. నియోజకవర్గంలో కూటమి నాయకుల మధ్య మనస్పర్థలు ఉన్నట్లు తెలిసిందని, వీటిని పరిష్కరించేందుకు ఇక్కడికి వచ్చానని, ముందుగా పిల్లి దంపతులతో మాట్లాడానని వెల్లడించారు. కూటమి ఎమ్మెల్యే పంతం నానాజీ అందుబాటులో లేకపోవడంతో మరోసారి వచ్చి ఆయనతో మాట్లాడతానని తెలిపారు. కూటమి ఐక్యతను దెబ్బతీసే విధంగా కొంత మంది ప్రత్యర్థులు ఇబ్బందికర పరిస్థితులు సృష్టిస్తున్నారని టీడీపీ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి అన్నారు. తనకు ఎమ్మెల్యే పంతం నానాజీకి మధ్య ఎటువంటి విభేదాలు లేవన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌ల స్ఫూర్తితో నియోజకవర్గ అభివృద్ధికి కూటమి నాయకులతో కలసి పని చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంపర ఏఎంసీ మాజీ చైర్మన్ కర్రి వెంకట్రాజు, మాజీ జడ్పీటీసీ బుంగాసింహాద్రి, మాజీ డిప్యూటీ మేయర్ కాళ్ల సత్తిబాబు, మాజీ కార్పొరేటర్లు పలివెల త్రిమూర్తులు, పాలిక ఉషారాణి, మాతా లక్ష్మణ్, తాతపూడి రామకృష్ణ, చొక్కా జగన్, పితాని అప్పన్న, మరుకుర్తి నాగబాబు, పిల్లి బుజ్జి, పిల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సుభాష్‌కు వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి దంపతులు

ఇంటర్ విద్యార్థినులకు లైంగిక వేధింపులు

- గిరిజన సంక్షేమ వసతిగృహంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- బాధ్యుడైన ప్రధానోపాధ్యాయుడిని డిప్యుటేషన్‌పై పంపించి సరిపెట్టిన వైనం
- గంగవరం ఆశ్రమ పాఠశాల వసతిగృహంలో ఘటనపై ఆందోళనకు సిద్ధమవుతున్న గిరిజన సంఘాలు

రంపచోడవరం, సెప్టెంబర్16: అల్లూరి జిల్లా గంగవరంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు అనుబంధంగా నడుస్తోన్న వసతిగృహంలో ఉంటున్న గంగవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల గిరిజన విద్యార్థినులపై ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లైంగిక వేధింపులకు పాల్పడుతున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆ ప్రధానోపాధ్యాయుడిపై క్రమశిక్షణ చర్యలతో పాటు బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన నేరం కింద కేసు నమోదు చేయించడం మానేసి కేవలం డిప్యుటేషన్‌పై మంగంపాడు బాలికల ఆశ్రమ పాఠశాలకు పంపించి అధికారులు చేతులు దులిపేసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. గంగవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల గిరిజన విద్యార్థినులకు వేరే ప్రత్యేక వసతిగృహం లేకపోవడంతో గంగవరంలోని ఆశ్రమపాఠశాల వసతి గృహంలోనే వీరికి వసతి కల్పించారు. దీంతో 10వ తరగతి విద్యార్థినులను పాఠశాల అయ్యాక చదివించే వంకతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిబంధనలకు విరుద్ధంగా బాలికల వసతిగృహంలోకి ప్రవేశించి అక్కడే ఉంటున్న ఇంటర్మీడియట్ విద్యార్థినులపై కన్నేశాడు. వారి వద్దకు చేరి వారి పక్కనే కూర్చొని, వారిని లైంగికంగా వేధించడం మొదలు పెట్టాడు. తొలుత అయనను ప్రతిఘటించి వ్యతిరేకించిన విద్యార్థినులు తనకు సహకరించకపోతే ఇక్కడ వసతి ఉండదొన్న హెచ్చరికలతో ఆయన వేధింపులను విద్యార్థినులు భరిస్తూ వచ్చారు. కొంతకాలానికి వారిలో ధైర్యం వచ్చి తమపై జరుగుతున్న వేధింపులను వారి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌కు వివరించారు. ఆయన తక్షణం స్పందించి స్థానికంగా ఉన్న తహశీల్దారు, ఇతర ఉన్నతాధికారులకు తెలియజేశారు. దీంతో స్పందించిన ఐటీడీఏ అధికారులు గంగవరం తహశీల్దారు నుంచి వాస్తవాలను గ్రహించారు. తహశీల్దారు ప్రాథమిక విచారణలో విద్యార్థినులు మొత్తం విషయాలను వివరించారు. ఈ ఆశ్రమ పాఠశాలలో ఓ ప్రధానోపాధ్యాయుడు వసతి గృహంలోని ఇంటర్ విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడితే ఆయనను కేవలం డిప్యుటేషన్‌పై పంపించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూడటంతో పలు గిరిజన సంఘాలు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి.

ఏజెన్సీ సమాచారం

'విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటా'

రంపచోడవరం, సెప్టెంబరు 16: రంపచోడవరం గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల(బాలికలు)లో విద్యార్థినులను వేధిస్తున్నా పాఠశాల ప్రిన్సిపాల్ జి.ప్రసూనపై విచారణ చేపట్టి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకులు ఇజాన్‌రాజ్ తెలిపారు. విద్యార్థినులు, తల్లిదండ్రులు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలంకు ఫిర్యాదు చేయడంతో తనను విచారణాధికారిగా నియమించారని, పూర్తిస్థాయిలో విచారణచేసి నివేదికను ఐటీడీఏ పీవోకు అందజేయనున్నట్లు తెలిపారు.

విద్యార్థినులను వేధిస్తే సహించేది లేదు

● అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించిన ఎమ్మెల్యే శిరీష


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

రంపచోడవరం, సెప్టెంబరు 16: రంపచోడవరం గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాల (బాలికలు) విద్యార్థులను వేధిస్తే సహించేదిలేదని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. అస్వస్థతకుగురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను ఆమె సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల ఆరోగ్యం గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ధైర్యంగా ఉండాలని,విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

● సీపీఎం డిమాండ్

రంపచోడవరం, సెప్టెంబరు 16: విద్యార్థినుల పట్ల అమానుషంగా వ్యవహరించిన పాఠశాల ప్రిన్సిపాల్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ డిమాండ్ చేశారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నడవలేకుండా ఇబ్బంది పడుతున్న విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని, గిరిజన హాస్టళ్లలో ఐటీడీఏ అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. సీపీఎంజిల్లా కార్యవర్గ సభ్యులు లోతా రామారావు, మట్ల వాణిశ్రీ, సిరిమల్లిరెడ్డి, శాంతిరాజుపాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో సత్తా చాటిన బాలికలు


రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం సాధించిన మోతుగూడెం డీఏవీ పాఠశాల బాలికలు

మోతుగూడెం, సెప్టెంబరు16:మోతుగూడెం డీఏవీ పాఠశాల 7,8,9 చదువుతున్న బాలికలు కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపించి ప్రథమ స్థానంలో నిలిచారు. విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడల్లో సత్తా చాటి త్వరలో గుజరాత్‌లో జరగుతున్నజాతీయ క్రీడా పోటీల్లో అర్హత సాధించారు. ఈ వీరిని పీటీ భద్రం, ప్రధానోపాధ్యాయుడు మల్లెల రఘురాం, ఎస్కా టీచర్ సుజాత, ఎల్ఎంసీ చైర్మన్ వాసుదేవరావు, సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ కామేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భీమవరపు బాలకృష్ణ, సీనియర్ అకౌంటు ఆఫీసర్ వరప్రసాద్, తదితరులు జెన్కో అధికారులు అభినందించారు.

ఘనంగా గణేశుడి నిమజ్జనాలు


వేలంపాటలో లడ్డూ దక్కించుకున్న రామకృష్ణ

కూనవరం, సెప్టెంబర్ 16: వినాయకచవితి సందర్భంగా మండలంలో పలు గ్రామాల్లో ఏర్పాటు వినాయక విగ్రహాల నిమజ్జనాలు కొనసాగుతున్నాయి. భారీ ఊరేగింపుల నడుమ భక్తిశ్రద్ధలతో విగ్రహాలను నిమజ్జనం చేస్తున్నారు. మండలంలో సుమారు 50కిపైగా గ్రామాల్లో వినాయక విగ్రహ మండపాలు ఏర్పాటు చేశారు. పలు ఆలయాల్లో అన్నదానం నిర్వహించారు. టేకులబోరులో విఘ్నేశ్వరుడి పది కేజీల లడ్డూను యాలం రామకృష్ణ రూ.12వేలకు దక్కించుకున్నారు.

వై.రామవరం: మండలంలో బస్ సెంటర్, వాల్మీకి వీధుల్లో నెలకొల్పిన గణపతి విగ్రహాలకు పూజలు జరిపి ట్రాక్టర్లపై పలు గ్రామాల్లో ఊరేగిస్తూ దేవరమడుగులలో పెద్దేరులో నిమజ్జనం చేశారు. ఊరేగింపులో యువత డీజే పాటలతో డ్యాన్సులుచేసి సందడి చేశారు.


వై.రామవరంలో గణనాథుడి ఊరేగింపు

వరద బాధితులకు అన్నదానం

కూనవరం, సెప్టెంబర్ 16: వరదల కారణంగా ఇంకా పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న వరద బాధితులకు సోమవారం అన్నదానం నిర్వహించారు. టేకులబోరుకు చెందిన సాయిబాబా ట్రస్టు నిర్వాహకులు కుచ్చర్లకోట సతీష్, కిరణ్మయి దంపతులు ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వందలాది మందికి భోజన సదుపాయం ఏర్పాటు చేశారు.

నిబద్ధతతోనే పనిచేయాలి

●ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ


అపుస్మా నూతన కార్యవర్గంను అభినందిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

దివాన్‌చెరువు, సెప్టెంబరు 16: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) నూతనకార్యవర్గంలో నియమించిన వారంతా నిబద్ధతతో పనిచేయాలని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. రాజానగరం మండలంలోని సంపత్‌నగరంలో రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్‌లో అపుస్మా జిల్లా సాధారణ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే బత్తుల మాట్లాడుతూ ప్రభుత్వపరంగా ఎటువంటి సహాయసహకారాలు అవసరమైనా అందించేందుకు తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని అన్నారు. నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను అపుస్మాతరపున ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అపుస్మా జిల్లా అధ్యక్షుడు పురెడ్ల కళ్యాణ్‌రెడ్డి, కార్యదర్శి పి.రామకృష్ణంరాజు, కోశాధికారి పి.సురేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.తులసీవిష్ణుప్రసాద్, రాష్ట్ర కోశాధికారి ఎంవీ రావు, జోనల్ అధ్యక్షుడు జంగా బాలాజీ, గుంటూరు, విశాఖ జిల్లా అధ్యక్షులు పోతిరెడ్డి, సుంకర శ్రీనివాస్, రాజమహేంద్రి విద్యాసంస్థలు చైర్మన్ టి.కె.విశ్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

హోటల్స్ రెస్టారెంట్‌లపై ఫుడ్ కమిటీ తనిఖీలు

● నిర్వాహకులకు నోటీసులు జారీ

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 16: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పబ్లిక్ హెల్త్ విభాగం ఆధ్వర్యంలో కమిషనర్ కేతన్ గార్గ్ ఏర్పాటు చేసిన ఫుడ్ కమిటీలు హోటల్స్, రెస్టారెంట్‌లపై ఆకస్మిక తనిఖీలు చేపట్టాయి. సోమవారం నగరపాలక సంస్థ శానిటరీ సూపర్‌వైజర్, ఫుడ్ కమిటీ ఇన్‌చార్జి ఇంద్రగంటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఫుడ్ కమిటీ బృందం స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని పలు హోటల్స్, రెస్టారెంట్‌లను తనిఖీ చేసి వాటి వంటశాలలను, ఆహార నాణ్యతను పరిశీలించారు. అపరిశుభ్ర వాతావరణం, నాణ్యతా ప్రమాణాలు పాటించని వాటికి నోటీసులు ఇచ్చారు. 14 రోజుల లోపు దానికి తగిన సమాధానం చెప్పి పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


రైల్వేస్టేషన్ సమీపంలో రెస్టారెంట్‌లో ఆహార పదార్థాలను తనిఖీ చేస్తున్న శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్

18 నుంచి పాఠశాల క్రీడాపోటీలు

రాజానగరం, సెప్టెంబరు 16 : రాజానగరం మండలస్థాయి క్రీడా పోటీలు ఈనెల 18 నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంఈవోలు రామన్నదొర, జ్యోతిప్రసాద్‌లు సోమవారం తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్, కోకో, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ అండర్ 14, అండర్ 17, బాలురు, బాలికలకు టోర్నమెంట్ కం సెలెక్షన్స్ నిర్వహిస్తామన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు విద్యార్థులు ఈ క్రీడాపోటీల్లో పాల్గొనవచ్చని ఎంఈవోలు తెలిపారు.


బిక్కవోలులో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి దంపతులను సత్కరిస్తున్న దృశ్యం


రంగంపేట: చంద్రేడులో గణపతి ఊరేగింపు


పుష్కరాల రేవులో గణేష్ నిమజ్జనాలను పరిశీలిస్తున్న అధికారులు

బిక్కవోలు లక్ష్మీగణపతి ఆలయాన్ని అభివృద్ధి చేస్తా

● ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి
● ఘనంగా గణపతి నిమజ్జనోత్సవాలు


పుష్కరాలరేవులో వినాయక విగ్రహాల నిమజ్జనం, దివాన్‌చెరువులో ఊరేగుతున్న లక్ష్మీగణపతి

బిక్కవోలు, సెప్టెంబరు 16: బిక్కవోలులోని ప్రాచీన లక్ష్మీగణపతి ఆలయంలో నిర్వహిస్తున్న చవితి ఉత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. స్వామివారిని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన అన్నదానాన్ని ప్రారంభించి పదివేలమంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. రాజకీయ పార్టీలకుఅతీతంగా స్వామివారి ఆలయాన్ని అభివృద్ధి చేసి స్వామివారి ఖ్యాతిని వ్యాపింప చేసేందుకు కృషిచేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులను ఉత్సవ కమిటీ ఘనంగా సత్కరించారు. స్వామివారి 50కిలోల లడ్డూను హైదరాబాద్‌కు చెందిన యారాసి నీలవల్లి సుష్మమేఘనమణి సుజనరెడ్డి వేలంపాటలో రూ. 1,11,116 లకు దక్కించుకోగా, వంద కిలోల లడ్డూను విజయవాడకు చెందిన బి.పర్వతసింగ్ రూ. 61,116కు దక్కించుకున్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చాగంటి సాయిబాబారెడ్డి, సభ్యులు పల్లి శ్రీనివాసరెడ్డి, పాలచర్ల శివప్రసాద్ చౌదరి, గొర్రెల త్రిమూర్తులు, నందిపాటి కిషోర్‌కుమార్‌రెడ్డి, కొమ్మోజు శ్రీనివాస్, పల్లి రాజారెడ్డి, బేరా గోవిందు, ఈవో ఆకెళ్ల భాస్కర్ పాల్గొన్నారు.

రంగంపేట: మండలంలో గల 17 గ్రామాల్లో గణపతి నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం గణపతి నవరాత్రులు పూర్తయిన 10వ రోజున మండలంలో రంగంపేట, వడిశలేరు, చంద్రేడు, పెదరాయవరం, కోటపాడు, మర్రిపూడి, నల్లమిల్లి, సింగంపల్లి, దొడ్డిగుంట, సుభద్రంపేట, వెంకటాపురం, ముకుందవరం, జి.దొంతమూరు, ఈలకొలను, వీరంపాలెం, ఎస్టీ రాజాపురం గ్రామాల్లో గణపతి ఉత్సవ విగ్రహాలను ఊరేగించి స్థానిక నల్లచెరువులో నిమజ్జనం చేశారు.

ఘనంగా లక్ష్మీగణపతి ఊరేగింపు

దివాన్‌చెరువు: దివాన్‌చెరువులో ఉన్న శ్రీలక్ష్మీగణపతి స్వామివారిని సోమవారం హంసవాహనంపై గ్రామంలో ఊరేగించారు. స్థానిక జాతీయరహదారిని ఆనుకుని ఉన్న దేవాలయాల సముదాయంలోని శ్రీ లక్ష్మీగణపతి ఆలయం వద్ద 54వ గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా హంసవాహనంపై స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఉంచి భజరంగ్, నవదుర్గలు, సైనాకోబ్రాల నృత్యాలతో డప్పు వాయిద్యాలతో స్వామివారిని గ్రామంలో ఊరేగించారు. భారీ అన్నదానం నిర్వహించారు. సాధుపేటలోని వినాయకుడిని వివిధ నృత్యాలు, డప్పులతో స్వామివారిని గ్రామంలో ఊరేగించారు. అనంతరం నిమజ్జనం చేశారు.


అనపర్తిలోని రావిచెట్టు వద్ద స్వామిని ఊరేగిస్తున్న భక్తులు

రాజానగరం: గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి కొనసాగుతోంది. ముగింపు వేడుకల్లో భాగంగా గ్రామాల్లో భారీ అన్న సమారాధనలు జరుగుతున్నాయి. భారీ గణనాధుల విగ్రహాలను ట్రాక్టర్లపై ఉంచి గ్రామాల్లోని ఊరేగిస్తున్నారు. చిన్నారులు, యువకులు ఊరేగింపు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. అనంతరం మండలంలోని కలవచర్లలోని పుష్కర, పోలవరం కాలువల్లో నిమజ్జనం చేస్తున్నారు.

సీతానగరం: గణపతి నవరాత్రులు ముగింపు సందర్భంగా మండలంలోని పలు నవరాత్రి ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గణపతి నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పుర వీధులలో ఊరేగించి ప్రభుత్వం ప్రకటించిన వంగలపూడి ముగ్గళ్ళ, మునికూడలి జాలిమూడి ర్యాంపులలో నిమజ్జనాలు చేశారు.

గణనాధుడికి ఘన వీడ్కోలు

అనపర్తి: అనపర్తి మండపంలో తొమ్మిది రోజులపాటు పూజలందుకున్న గణనాధులకు సోమవారం భక్తులు ఘన వీడ్కోలు పలుకుతూ నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలలో నెలకొల్పిన సుమారు 40విగ్రహాలకు సోమవారం నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. గణపతి నిమజ్జన కార్యక్రమానికి అనపర్తి ధరణికోట శివాలయం వద్ద పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించి క్రేన్ల సహాయంతో నిమజ్జనాలు చేశారు.

కాపవరం గణపతి నిమజ్జనంలో

కూటమి నాయకులపై వైసీపీ నేతల దాడి

● కూటమి నాయకులను పరామర్శించిన ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, సెప్టెంబరు 16: బిక్కవోలు మండలం కాపవరంలో సోమవారం లక్ష్మీగణపతి ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిమజ్జన కార్యక్రమంలో వైసీపీ నాయకులు కూటమి నాయకులపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో గాయపడిన కూటమి నాయకులు అనపర్తి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గతంలో కమిటీని నిర్వహించిన సర్పంచ్ సత్యంశెట్టి రమణ కమిటీకి చెందిన సొమ్ములపై వివాదం జరుగుతుందని నిమజ్జనం సందర్భంగా తామంతా కార్యక్రమంలో లీనమై ఉండగా సర్పంచ్ వర్గీయులు తమపై కర్రలతో దాడికి పాల్పడ్డారని అన్నారు. అనపర్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కూటమి నాయకులను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సోమవారం రాత్రి పరామర్శించి సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ అక్రమాలపై ఉన్నతాధికారుకు ఫిర్యాదు చేసి విచారణ నిర్వహిస్తామని ఎమ్మెల్యే అన్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డిని ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట కూటమి నాయకులు సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, కాపవరం టీడీపీ జనసేన బీజేపీ నాయకులు ఉన్నారు.


ఆసుపత్రిలో చికిత్స పొందున్న కూటమి నాయకులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

దేశాభివృద్ధిలో ఎల్ఐసీ ప్రముఖ పాత్ర

● ఎల్ఐసీ డివిజనల్ మేనేజర్ సంధ్యారాణి


సంధ్యారాణిని సత్కరిస్తున్న సత్యదేవా నర్సరీ పెదసత్యనారాయణ, ఏజెంట్లు

కడియం, ఆగస్టు 16 : దేశాభివృద్ధిలో జీవితబీమా ప్రముఖ పాత్ర పోషిస్తుందని ఎల్ఐసీ రాజమహేంద్రవరం డివిజనల్ మేనేజర్ కె.సంధ్యారాణి తెలిపారు. సోమవారం కడియపులంక పుల్లా చంటియ్య-సత్యదేవానర్సరీలో జీవితబీమా ఏజెంట్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.సంధ్యారాణి మాట్లాడుతూ జీవితబీమా సంస్థ నేడు దేశాభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. సంస్థకు ఏజెంటులే కీలకం అన్నారు. ప్రతీఒక్కరికి పాలసీల ద్వారా ఆర్థిక భరోసా నివ్వడంలో ఏజెంట్లు ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని అలానే ఏజెంట్లు కూడా మంచి వ్యాపారం చేసి ఆర్థికాభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. ఎస్‌డీఎం కె.సంధ్యారాణి, ఎల్ఐసీ అధికారులు, ఏజంట్లు సత్యదేవా నర్సరీ ఎండీ పుల్లా పెదసత్యనారాయణను ఘనంగా సత్కరించారు. ఏజెంట్ల సంఘం అధ్యక్షుడు ఆదిమూలం సాయిబాబా, రూరల్ బ్రాంచి మేనేజర్ సూర్యనారాయణ, ఏబీఎం అబ్రహం, ఏజంట్లు పాల్గొన్నారు.

విద్యుత్ లోవోల్టేజీ సమస్య పరిష్కరించాలి

● విద్యుత్ శాఖ సమీక్షలో ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, సెప్టెంబరు 16: నియోజకవర్గంలో అనేక గ్రామాలలో లోవోల్టేజీ సమస్య అధికంగా ఉందని దీనిని నివారించేందుకు కార్యాచరణ రూపొందించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అనపర్తి నియోజకవర్గ విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం అనపర్తి పంచాయతీ కార్యాలయంలో అనపర్తి నియోజకవర్గ విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు కూటమి నాయకులు గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యంగా అధికారులు వినియోగదారుల పట్ల గౌరవం చూపాలని కొన్ని గ్రామాల్లో కనీసం అధికారుల నుంచి స్పందన లభించడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయని అన్నారు. అవసరమైన చోట్ల ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అనపర్తి ప్రాంతంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు ఆవశ్యకతపై ఎమ్మెల్యే అధికారులతో చర్చించారు. సబ్ స్టేషన్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సమావేశంలో రాజమహేంద్రవరం రూరల్ ఈఈ శ్రీధర్ వర్మ, ఏడీఈ నిరంజన్‌బాబు, అనపర్తి ఏఈ వీరభద్రరావు, బిక్కవోలు, రంగంపేట మండలాలకు చెందిన ఏఈలు, విద్యుత్ సిబ్బంది కూటమి నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

● ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా పక్షం రోజుల పాటు దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాల విజయ వంతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం అనపర్తి పంచాయతీ కార్యాలయంలో నియోజక వర్గంలోని నాలుగు మండలాల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. ఈనెల 19న పొలమూరులో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నామని ఈ కార్యక్రమంలో ఎంపీ పురందరేశ్వరి పాల్గొంటారని తెలిపారు.

నవంబరు 3న శెట్టిబలిజ వన సమారాధన


సమావేశంలో మాట్లాడుతున్న సానబోయిన రామారావు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 16: శెట్టిబలిజ వనసమారాధన కార్యక్రమం నవంబరు 3న రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్నామని శెట్టిబలిజ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సానబోయిన రామారావు తెలిపారు. రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డులోని సంఘ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వనసమారాధనతో పాటు 2024 విద్యాసంవత్సరంలో పదో తరగతిలో 550 మార్కులు సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తామని, శెట్టిబలిజ వధూవరుల ఉచిత వివాహ పరిచయవేదిక నిర్వహించనున్నట్టు చెప్పారు. సమావేశంలో మట్టపర్తి సత్యనారాయణ, గుబ్బల ఉదయభాస్కరరావు, చెల్లుబోయిన వెంకటేశ్వరరావు, బొక్కా వెంకటప్రతాప్, బత్తిన ఏడుకొండలు పాల్గొన్నారు.

జేసీఐ 54 వసంతాలు వేడుక

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 16: రాజమహేంద్రవరం హోటల్ లాహాస్పిన్‌లో జేసీఐ 54 వసంతాల వేడుకలు ఘనంగా జరిగాయి, జేసీఐ రాజమండ్రి ప్రెసిడెంట్ లచ్చిరెడ్డి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కీనోట్ స్పీకర్‌గా టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ విచ్చేశారు. ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ జేసీఐ సేవలను కొనియాడారు. అనంతరం సీనియర్ సిటిజన్ అవార్డును అశోక్‌కుమార్ జైన్, గంధం నాగసుబ్రహ్మణ్యం అవార్డును మొండెపు ప్రసాద్, ఔట్ స్టాండింగ్ యంగ్ పర్సన్ అవార్డు రచన జైన్, ఔట్ స్టాండింగ్ కమల్ పత్ర అవార్డు చల్లా విజయరామారావు, కీర్తిలను సత్కరించారు.

బొజ్జ తారకంకు నివాళి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 16: హైకోర్టు న్యాయవాది, దళిత నేత బొజ్జ తారకం 9వ వర్ధంతి సందర్భంగా పలు సంఘాల నాయకులు నివాళులర్పించారు. సోమవారం రాజమహేంద్రవరంలో బీఎస్పీ కార్యాయలంలో న్యాయవాది ఇసుకపట్ల రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బొజ్జ తారకం చిత్రపటానికి జార్జి ఆంటోని, కొంకి రమేష్, కోనాల లాజర్, నక్కా వెంకటరత్నరాజు, సుందరపల్లి అనీల్, గుబ్బిం అనిల్‌కుమార్ పూలమాలతో నివాళులర్పించారు. కారంచేడు ఉద్యమంలోను, చుండూరు, కదిరికుప్పం, లక్ష్యంపేట హత్యాకాండ ఉద్యమాల్లో బొజ్జతారకం పోరాటపటిమ దళితజాతికి ఆదర్శమన్నారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో కొత్తూరు విద్యార్థు ప్రతిభ

అనపర్తి, సెప్టెంబరు 16: ఇటీవల రాజమహేంద్రవరంలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో అనపర్తి శివారు కొత్తూరులోని బీఆర్ అంబేద్కర్ సెంటినరీ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి పతకాలు సాధించినట్లు ప్రిన్సిపల్ పి.సత్యనారాయణ తెలిపారు. అండర్ 18, 20 పోటీలలో బంగారు, వెండి, రజతపతకాలను సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ పోటీలలో 12మంది విద్యార్థులు పాల్గొని 17 పతకాలు సాధించినట్లు ఆయన తెలిపారు. పీడీ ఆర్.నాగశివను, పతకాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.


పతకాలు సాధించిన కొత్తూరు గురుకుల కళాశాల విద్యార్థులతో అధ్యాపక బృందం

దాతలు ముందుకు రావడం అభినందనీయం

● ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ● సీఎం సహాయ నిధికి విరాళాలు


ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు చెక్కులను అందిస్తున్న గన్నికృష్ణ, సువిశేషపురం రక్షణాలయం సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 16: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావడం మానవతా దృక్పధానికి నిదర్శనమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. వరద బాధితుల సహాయార్థం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ సీఎం సహాయ నిధికి రూ.1లక్షను ఎమ్మెల్యే వాసుకు సోమవారం అందించారు. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛందంగా దాతలు ముందుకు వచ్చి సహాయం చేస్తే బాధితులకు మేలు జరుగుతుందని గన్ని అన్నారు. అలాగే సువిశేషపురం రక్షణాలయం సభ్యులు సమకూర్చిన రూ.1లక్ష చెక్కును సెయింట్ జన్ పారిస్ సభ్యులు మార్టిన్ లూథర్, జంగ సుబ్బారావు, తలారి రత్నరాజు, డి.భూషణరావు, రాచపల్లి ప్రసాద్ ఎమ్మెల్యేకు అందించారు. అద్దేపల్లి మాధవి ఓంశాంతి వారు రూ.1లక్ష, జాంపేట దేవాంగ సంక్షేమ సంఘం రూ.34,505, మేకా పాపారావు రూ.10వేలు అందించారు. కార్యక్రమాల్లో ఆర్.శ్యామ్, సుధాకర్, ఆర్.విజయకుమార్, వాసా వర్ధిల్, రాచపల్లి మాణిక్యాలరావు, జి.సంపత్ పాల్గొన్నారు.

'షిర్డీసాయి' సేవలు అభినందనీయం: ఎమ్మెల్యే గోరంట్ల


ఎమ్మెల్యే గోరంట్లకు రూ.లక్ష చెక్కును అందజేస్తున్న షిర్డిసాయి యాజమాన్యం

కడియం, సెప్టెంబరు 16: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండే కడియం షిర్డి సాయి విద్యానికేతన్- డేప్నీ ఏసియాటిక్ స్కూల్ విద్యాసంస్థల సేవలు అభినందనీయమని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. సోమవారం షిర్డిసాయి-డేప్నీ విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ సోమవారం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి సీఎం రిలీఫ్‌ఫండ్ నిమిత్తం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌ను ఎమ్మెల్యే గోరంట్ల అభినందించారు.

● కడియం, వీరవరం గ్రామ టీడీపీలు రూ.40వేల విరాళాన్ని అందజేశారు.

● దుళ్ళ గ్రామానికి చెందిన యన్నమని లక్ష్మీపతి రూ.1,01,116 అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో మండల టీడీపీ అధ్యక్షుడు వెలుగుబంటి నాని, గోరు నాగేశ్వరరావు, దొంతంశెట్టి శ్రీనివాస్, ఉట్ల శ్రీనివాస్, వనుం సూరిబాబు, షిర్డిసాయి-దొరబాబు, పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

మంత్రి నారా లోకేష్‌కు రూ.35 లక్షల చెక్కు అందజేత


నారా లోకేష్‌కు రూ 35 లక్షలు చెక్కు అందజేస్తున్న దృశ్యం

సీతానగరం, సెప్టెంబరు 16: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సోమవారం హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసంలో పెందుర్తి వెంకటేష్ కుమారుడు పెందుర్తి అభిరామ్, మలేసియాలో ఉంటున్న ఫీ యూనిక్ డైరెక్టర్ అనిల్ కుమార్‌లు మంత్రి నారా లోకేష్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ పేరుతో రూ.35లక్షల చెక్కును అందజేశారు. అనిల్‌కుమార్ పెందుర్తి అభిరామ్‌కు అత్యంత సన్నిహితులు కావడంతో అభిరామ్‌తో కలిసి చెక్కును అందజేశారు. వారితో లోకేష్ కొంతసేపు ముచ్చటించిన అనంతరం లోకేష్‌తో కలసి విజయవాడ వెళ్లినట్లు అభిరామ్ తెలిపారు.

నేటి నుంచి మూడు రోజులపాటు

రాజమహేంద్రవరంలో ఎంపీ పురంధేశ్వరి పర్యటన

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 16: రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మూడు రోజులపాటు పాల్గొనే కార్యక్రమాల వివరాలను ఎంపీ కార్యాలయం సోమవారం వెల్లడించింది. ఈనెల 17వ తేదీ మంగళవారం ప్రధాని మోదీ పుట్టిన రోజు సందర్భంగా ఉదయం పదిన్నర గంటలకు క్వారీ మార్కెట్ సెంటర్లోని అన్న కేంటీన్‌ను సందర్శిస్తారు. ఆ రోజున పేదల టిఫిన్, భోజనాలకు అయ్యే ఖర్చును భరిస్తారు. అనంతరం గౌతమీ నేత్రాలయానికి చేరుకుని పరికరాలు అందజేసే కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం మూడు గంటలకు రాజానగరం జోగి జగన్నాథరావు పంతులు బహదూర్ అన్నదాన సత్రం కల్యాణ మండపంలో బీజేపీ సదస్యత అభియాన్ కార్యక్రమంలో పాల్గొంటారు. 18న విజయవాడలో జరిగే ఎన్‌డీఏ పార్లమెంట్ సభ్యులు, శాసన సభ్యుల సమావేశంలో పాల్గొంటారు. 19న ఉదయం గోదావరి గట్టున సినీ హాస్య నట చక్రవర్తి పద్మశ్రీ రేలంగి వెంకటరామయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటలకు రాజమహేంద్రవరం నటరాజ్, జయరాం థియేటర్ రోడ్డులోని అంబేడ్కర్ వెల్ఫేర్ కమ్యూనిటీ అసోసియేషన్ హాలులో మొబైల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే సన్మాన కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 3 గంటల నుంచి రాజమహేంద్రవరం విద్యుత్ కాలనీలోని ఎంపీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని ఎంపీ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.

'విద్యారంగంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం తగదు'

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 16: విద్యారంగంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం రాజమహేంద్రవరంలోని మావో భవన్‌లోని పీడీఎస్‌యూ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌ఎంసీ అనుమతులిచ్చిన మెడికల్ కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించలేమని ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు. కొత్తగా ఏర్పడిన మెడికల్ కాలేజీల్లో ఉన్న సీట్లను భర్తీ చేస్తే రాష్ట్ర విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఎంబీబీఎస్ మెడికోలకు న్యాయం చేయాలని, లేకుంటే ఉద్యమిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా నాయకుడు భాను ప్రసాద్, దినేష్, విక్రమ్, రోహిత్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


'బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించండి'

దివాన్‌చెరువు, సెప్టెంబరు 16: బోధనేతర విధుల నుంచి ఉపాధ్యాయులకు విముక్తి కల్పించాలని ఎస్టీయూ రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్ సూరి జయ త్రినాధబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయులు బోధనేతర పనులకు దూరంగా ఉండాలని తెలిపారు. దురదృష్టవశాత్తు మనరాష్ట్రంలో మాత్రం ఇది అమలు కావడంలేదని వాపోయారు. విద్యాశాఖ రూపొందించిన యాప్‌లతో కుస్తీ పట్టడానికే పాఠశాల పనివేళలు సరిపోతున్నాయన్నారు. దీంతో బోధనకు తగిన సమయం ఉండడం లేదని అన్నారు. దాదాపు ఎనిమిది సంవత్సరాల నుంచి ఈ యాప్‌ల నిర్వహణ నుంచి తమను తప్పించాలని ఉపాధ్యాయ సంఘాలు పలు మార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లినా ఫలితం కనబడలేదని అన్నారు. ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవ కారణంగా మురుగుదొడ్ల తీసేపని నుంచి మాత్రం ఉపాధ్యాయులకు విముక్తి కలిగిందని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ప్రతీ పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌లను నియమించి ఈ బాధ్యతలను వారికే అప్పగిస్తే బాగుంటుందని త్రినాధబాబు సూచించారు. ఎస్టీయూ మండల అధ్యక్షుడు ధర్మరాజు, ప్రధానకార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఆర్థిక కార్యదర్శి వీరబాబు, నాయకులు పి.వి.వి.భీమేశ్వరరావు పాల్గొన్నారు.

జాతీయ టీటీ పోటీల్లో త్రిషాల్‌కు సిల్వర్ మెడల్


త్రిషాల్ రాజ్‌కుమార్‌ను సిల్వర్ మెడల్‌తో సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరంకల్చరల్, సెప్టెంబరు 16: రాజమహేంద్రానికి చెందిన టేబుల్‌టెన్నిస్ క్రీడాకారుడు జాతీయపోటీల్లో సిల్వర్ మెడల్ సాధించాడు. స్థానిక గౌతమి టేబుల్ టెన్నిస్ అకాడమీ క్రీడాకారుడు సూరపురెడ్డి త్రిషాల్ రాజ్‌కుమార్ హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం కాంగ్రాలోని రెయిన్‌బో అకాడమీలో ఈ నెల 11నుంచి 18వరకు జరుగుతున్న యూటీటీ నేషనల్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ పోటీలలో అండర్-15 బాలుర విభాగంలో పాల్గొని సిల్వర్ మెడల్ సాధించాడు. విభజిత ఆంధ్రప్రదేశ్ నుంచి ఈ ఘనత సాధించిన మొట్టమొదటి క్రీడాకారుడిగా రాజ్‌కుమార్ నిలిచారని ఏపీటీ టీఏ ఉపాధ్యక్షుడు, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు విశ్వనాథం భాస్కరరామ్ చెప్పారు. ఈ సందర్భంగా క్రీడాకారుడిని టీటీఏ జిల్లా అధ్యక్షుడు జేవీవీ అప్పారెడ్డి, కోశాధికారి కె.సత్యనారాయణ, కోచ్ పి.వేణుగోపాలరావు, వీటీవీ సుబ్బారావు, అసోసియేషన్ సభ్యులు అభినందించారు.




రాజమహేంద్రి గోదావరిలో నిమజ్జనం అవుతున్న గణనాథుడు

గణపతికి ఘన వీడ్కోలు

ఊరేగింపులతో గోదావరి చెంతకు

గోదారమ్మ ఒడిలోకి 700 గణనాథులు

ఘనంగా సాగుతున్న గణపతి విగ్రహాల నిమజ్జనం


గోదావరిలో నిమజ్జన దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ/కల్చరల్, సెప్టెంబరు 16: గణపతి నవరాత్రులు ముగిసిన సందర్భంగా జిల్లావ్యాప్తంగా రాజమహేంద్రవరం డివిజన్‌లోని పలు మండపాల్లో పూజలందుకున్న గణపతులకు భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. రాజమహేంద్రవరంలో ఉత్సవ కమిటీలు వారి గణపతుల విగ్రహాలను అలంకరించిన వాహనాల్లో పురవీధుల గుండా ఊరేగింపుగా గోదావరి బండ్ జీవకారుణ్య సంఘం ఎదురుగా ఉన్న ర్యాంప్ వద్దకు చేరుకున్నారు. అక్కడ పోలీసులు, నగరపాలక సంస్థ అధికారుల సమన్వయంతో ర్యాంప్‌లోకి ఒక్కొక్క వాహనాన్ని ఇద్దరు కమిటీ సభ్యులను అనుమతించి క్రేన్ సహకారంతో పంటులోకి విగ్రహాలను చేర్చి నది మధ్యలోకి తీసుకెళ్లి గోదావరిలో మునిసిపల్ సిబ్బందే నిమజ్జనం చేశారు. దీనిని పెద్దఎత్తున గోదావరి బండ్ రోడ్డు పైనుంచి భక్తులు తిలకించి గణపతికి వీడ్కోలు పలికారు. రాజమహేంద్రవరం పరిసర గ్రామాల్లో మొత్తం 1500 విగ్రహాలు భక్తుల పూజలు అందుకున్నాయి. వాటిలో మూడ్రోజులుగా 700 విగ్రహాలు గోదావరి ఒడిలోకి చేరాయి. సోమవారు ఉదయం నుంచి రాత్రి వరకు 80 విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఇంకా సుమారు 800 విగ్రహాలు నిమజ్జనం కావాల్సివుంది. మంగళ, బుధవారాల్లో పెద్దఎత్తున గణపతి విగ్రహాల నిమజ్జనం కొనసాగనుంది. విగ్రహాల నిమజ్జనంలో ఎటువంటి అపశృతులు జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. నవరాత్రుల ముగింపు సందర్భంగా లడ్డూ వేలం, అన్నదానాలు జరిగాయి. జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ పాల్గొని భోజనాలు వడ్డించారు. రాజమహేంద్రవరం పుష్కర్‌ఘాట్ వద్ద సృష్టి గణపతి స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూర్ణాహుతి హోమం కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


బై బై గణేశా..



డబ్బు కొట్టు సీటు పట్టు!

- పోలీసు శాఖలో బదిలీల పందేరం
- ఆరోపణలున్నా కోరుకున్న చోటికే
- జిల్లా బాస్ ఒప్పుకోక తప్పని పరిస్థితి
- వీఆర్, లూప్‌ల వాళ్లకు దక్కని అవకాశం
- అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీల సీట్లు ఖాళీ
- ఇంకా పూర్తిగా భర్తీకాని సీఐ స్థానాలు
- అధికార కూటమిలో.. అనధికార వైసీపీ హవా
- సీఎం చంద్రబాబు సమీక్షించాలని వేడుకోలు

కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి మూడు నెలలు దాటింది. అయినా పోలీస్ శాఖలో బదిలీల పందేరం సా..గుతూనే ఉంది. డబ్బు కొట్టిన వాళ్లకే సీట్లు దక్కుతున్నాయనే వాదన పెద్ద ఎత్తున వినవస్తోంది. గతంలో పని చేసిన చోట పలు ఆరోపణలు ఎదుర్కొన్న వారు సైతం మళ్లీ అదే స్థానం దక్కించుకోవడం దానికి బలాన్ని చేకూరుస్తోంది. పైగా వైసీపీకి తమ వంతు సాయం చేసిన వాళ్లకూ మంచి పోస్టింగులే వచ్చాయి. వీఆర్, లూప్‌లైన్లలో ఏళ్ల తరబడి చేసిన వాళ్లకు అసలు లా అండ్ ఆర్డర్ విభాగంలో పోస్టింగులు దక్కడం లేదనే చర్చ ఆ శాఖ వర్గాల్లో నడుస్తోంది. కూటమి వచ్చిన తర్వాత తమకు అవకాశం దక్కుతుందని ఆశగా ఎదురు చూసిన వారికి నిరాశే మిగులుతోంది. ఈ పరిస్థితుల్లో పోలీసు బదిలీల్లో ఏంటీ గందరగోళం? అసలు ప్రభుత్వానికి ఈ తంతు తెలుస్తోందా? అనే మీమాంశ నెలకొంది. డబ్బులిచ్చి పోస్టింగ్ తెచ్చుకున్న వాళ్లు సొంపాదనకు మొగ్గు చూపకుండా పేదోళ్ల పక్షాన ఉంటారా? అనే ప్రశ్న జనుల నుంచి గట్టిగా వినబడుతోంది.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వం పోలీసులను ఎంత దారుణంగా సొంత పనులకు వాడుకుందో ప్రజలకు తెలిసిందే. అప్పుడు రూల్ ప్రకారం నడుచుకున్న వాళ్లంతా కూటమి ప్రభుత్వం వచ్చాక కాస్త సాంత్వన చెందారు. తమకు ప్రాధాన్యం ఇస్తారని అనుకొన్నారు. కానీ వాస్తవం భిన్నంగా ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక పోలీస్ వ్యవస్థలో సమూల ప్రక్షాళన చేపట్టింది. దీనిలో భాగంగా నిజాయితీ అధికారిగా పేరున్న సీహెచ్ ద్వారకాతిరుమలరావును ఏరికోరి రాష్ట్ర పోలీస్ బాస్‌గా నియమించింది. తర్వాత బదిలీల తంతు మొదలైంది. ముందుగా రాష్ట్ర స్థాయిలో బదిలీలు చేపట్టారు. తర్వాత జిల్లా అధికారుల వంతు వచ్చింది. ఈ 'తతంగం' అంతా పైస్థాయిలో జరగడంతో కొందరు వైసీపీ మనుషులు కూడా సందట్లో సడేమియాగా మంచి స్థానాలు దక్కించుకున్నారనే విమర్శలు ఉన్నాయి. తర్వాత సీఐలు, ఎస్‌ఐల బదిలీలు చేపట్టారు. వీరిని బదిలీ చేసే అధికారం రేంజ్ డీఐజీకి ఉంటుంది. ప్రస్తుతం ఏలూరు రేంజ్ ఐజీగా అశోక్‌కుమార్ ఉన్నారు. ఆయనకు మంచి అధికారిగా పేరుంది. ఈనేపథ్యంలో బదిలీల్లో చేతులు మారుతున్న రొక్కం ఎవరి జేబుల్లోకి వెళుతోందనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. జిల్లాలోని ఇటీవల జాయిన్ అయిన ఓ సీఐకి కీలకమైన స్టేషను ఇవ్వడానికి నిజాయితీ గల జిల్లా ఉన్నతాధికారి నిరాకరించారని సమాచారం. అయితే ఓ ప్రజాప్రతినిధి పై స్థాయిలో తీవ్ర ఒత్తిడి తీసుకురావడంతో ఆ ఉన్నతాధికారి మెత్తబడక తప్పలేదని చెబుతున్నారు. ప్రజలను గత వైసీపీ పాలకుల దాష్టీకాల నుంచి బయటకు తీసుకొచ్చి సుపరిపాలన అందించాలని కూటమి పెద్దలు శ్రమిస్తుంటే కింది స్థాయిలో.. అదీ రోజూ ప్రజలతో నేరుగా సంబంధాలు ఉండే ఇలాంటి పోస్టులు డబ్బుకు దాసోహం కావడంపై తీవ్రస్థాయిలో విమర్శలు ఉన్నాయి. దీంతో పోలీసు శాఖలోని పోస్టింగులను సీఎం లేదా డిప్యూటీ సీఎం స్థాయిలో పునఃసమీక్షించాలనే చర్చ నడుస్తోంది. లేదంటే పోలీస్ బదిలీలు ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే అవకాశం ఉందనే వాదన వినవస్తోంది.

● ఉన్నతాధికారులు ఏరీ?

జిల్లాలోని ఎస్సీ ఎస్టీ సెల్, దిశ, రాజమహేంద్రవరం డివిజన్లో ఈస్ట్, వెస్ట్, సౌత్, నార్త్, కొవ్వూరు డివిజన్‌లో కొవ్వూరు సబ్-డివిజన్ తదితర విభాగాల్లో డీఎస్పీలు ఉన్నారు. జిల్లా స్థాయిలో ఎస్పీ పోలీస్ బాస్ కాగా.. క్రైమ్స్, పరిపాలన, శాంతి భద్రతలు, ఏఆర్ విభాగాలకు అడిషనల్ ఎస్పీలు ఉన్నారు. వీరంతా పర్యవేక్షణ అధికారుల పరిధిలోకి వస్తారు. ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు మార్పులు జరిగాయి. అయితే తర్వాత కూటమి ప్రభుత్వం వచ్చాక జరిగిన బదిలీల్లో ఎన్నికల కోటాలో వచ్చిన వారు వెనక్కు వెళ్లగా.. కొందరిని మార్పు చేశారు. ఇప్పటికీ కీలకమైన స్థానాలు ఖాళీగానే ఉన్నాయి. క్రైమ్స్, పరిపాలన విభాగాల అడిషనల్ ఎస్పీ సీట్లు భర్తీ చేయలేదు. కీలకమైన ఎస్‌బీ, క్రైమ్స్ డీఎస్పీలు, ఎస్సీఎస్టీ సెల్, ఈస్ట్, నార్త్ జోన్ల డీఎస్పీ స్థానాల్లో ఇంచార్జిలు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ పోస్టుల్లో అధికారులు రావడానికి ట్రయల్స్‌లో ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. ఇలా సమర్థత ఆధారంగా కాకుండా డబ్బు బరువుతో పోలీస్ పోస్టింగులను తూకం వేస్తుండడం చూస్తుంటే రానున్న రోజుల్లో అభాగ్యులకు వీళ్ల నిజాయితీగా ఎంత వరకూ న్యాయం చేస్తారో వేచి చూడాల్సిందే.

● ఇదీ తంతు..

జిల్లాలో 25 పోలీస్ స్టేషన్లుండగా వివిధ విభాగాలతో కలిపి 29 మంది సీఐలను జిల్లాకు కేటాయించారు. రాజానగరం, నల్లజర్ల, కొవ్వూరు టౌన్, రాజమహేంద్రవరంలోని వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్, ప్రకాశంనగర్, రూరల్‌లోని బొమ్మూరు స్టేషన్లకు సీఐలు ఎస్‌హెచ్‌వోలుగా ఉన్నారు. మిగతా పోలీస్ స్టేషన్లలో ఎస్‌ఐలు ఎస్‌హెచ్‌వోలుగా ఉన్నారు. జిల్లాలో కొవ్వూరు రూరల్, కోరుకొండ, దేవరాపల్లి, అనపర్తి, నిడదవోలు సర్కిళ్లు ఉన్నాయి. అయితే వీటిలో చాలా స్టేషన్లలో 'ట్రై' చేసుకున్న వాళ్లే ఉన్నారని చెబుతున్నారు. ఇప్పటికీ వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్ క్రైం స్టేషన్లకు సీఐలు లేరు. ఈ మూడింటికీ వీఆర్‌లో ఉన్న ఒక సీఐ 'అందాక' బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అలాగే రోడ్డు ప్రమాదాల జాబితాలో ముందుండే దేవరాపల్లి స్టేషనుకు రెగ్యులర్ సీఐ లేరు. ఈ స్టేషను బాధ్యతనూ వీఆర్‌లో ఉన్న సీఐ తాత్కాలికంగా చూస్తున్నారు. అసలే జిల్లా కేంద్రంలో అస్తవ్యస్తమైన ట్రాఫిక్‌ని దారిలో పెట్టడం ఎవరి తరమూ కావడం లేదు. దీనికితోడు ఇప్పుడు ట్రాఫిక్ సీఐ కూడా లేరు. సాధారణంగా గతంలో పనిచేసిన స్టేషనులో ఆరోపణలు ఉంటే మళ్లీ అదే స్టేషనులో పోస్టింగు రావడం అత్యంత కష్టమని చెబుతారు. కానీ ఇప్పుడు ఆ పని 'సొమ్ము'తో సులభంగా జరిగిపోతోందనే ఆరోపణలు ఉన్నాయి. తీవ్రమైన ఆరోపణల వల్ల ఎన్నికల కౌంటింగ్‌కి రెండు రోజుల ముందు కొవ్వూరు డీఎస్పీ, అదే కార్యాలయంలో తిష్ట వేసిన ఏఎస్‌ఐపై కఠిన చర్యలు తీసుకొన్నారు. డీఎస్పీకి ఉన్నతాధికారులు ఉద్వాసన పలికారు. ఎక్కడా పోస్టింగు ఇవ్వకుండా డీజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఏఎస్‌ఐని దేవరపల్లి బదిలీచేశారు. కానీ కొవ్వూరు వీడడం సుతరామూ ఇష్టం లేని ఆ ఉద్యోగి మళ్లీ ఇప్పుడు కొవ్వూరు టౌన్ పీఎస్‌కి బదిలీ చేయించుకొన్నారు. బదిలీల గోల్‌మాల్‌కి ఇదో ఉదాహరణని ఆ శాఖలో అంతర్గతంగా గుసగుసలు వినవస్తున్నాయి. దీంతో విధి నిర్వహణలో చావును అంగుళం దూరంలో చూసి, ధైర్యసాహసాలకు రాష్ట్రపతి మెడల్స్ సంపాదించిన వారు, ఏళ్ల తరబడి జిల్లా పోలీసు కార్యాలయంలో.. ఇతర లూప్‌లైనులో మగ్గిపోతున్నవారు ఖర్చు పెట్టుకోలేక స్టేషన్లను అందుకోలేకపోవడం నిజాయితీని ప్రశ్నిస్తోంది. వైసీపీకి కొమ్ముకాసిన వారికి మంచి పోస్టింగులు రావడంతో వైసీపీ హవానే కొనసాగే ప్రమాదం ఉందని, అందువల్ల బదిలీలపై సీఎం చంద్రబాబు దృష్టి సారించి సమీక్షించాలనే డిమాండ్లు వినవస్తున్నాయి. కూటమి ప్రజాప్రతినిధులకు ఈ పోస్టింగుల్లో మతలబులు ఎందుకు తెలియడం లేదనే అనుమానం కూడా నడుస్తోంది.

● అయోమయంలో కింది సిబ్బంది

తమకు బదిలీలు ఎప్పుడా అని కానిస్టేబుల్ నుంచి ఏఎస్‌ఐ కేడర్ వరకూ ఎదురు చూస్తున్నారు. జిల్లాలో 900 మంది ఆ స్థాయి సిబ్బంది ఉండగా.. వారిలో ఐదేళ్లు దాటిన వారు సుమారు 200 మంది ఉండొచ్చు. వారి బదిలీలను ఇప్పటి వరకూ పట్టించుకోలేదు. ప్రస్తుతం పిల్లలకు స్కూలు ఫీజులు కట్టేయడం, తరగతులు ప్రారంభంకావడంతో కౌన్సెలింగ్ చేసి దూరాభారం కాకుండా సహేతుకంగా బదిలీలు చేయాలని కోరుకుంటున్నారు. అలాగే ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి విషయంలో కఠినంగా ప్రవర్తించాలని విన్నవిస్తున్నారు. జగదీశ్ ఎస్పీగా ఉన్నప్పుడు 120 మందితో బదిలీల జాబితా సిద్ధమైంది. తర్వాత ప్రభుత్వం మారాక, డీజీపీగా ద్వారకా తిరుమలరావు పగ్గాలు చేపట్టిన తర్వాత వాటిని ఆపాలని ఉత్తర్వులు రావడంతో బదిలీల్లేవు.

● ఎక్సైజ్ వంతు

సెబ్‌ని రద్దు చేసే ప్రక్రియలో ఉండడం, కొత్త మద్యం పాలసీపై సమావేశాల వల్ల ఎక్సైజ్ బదిలీల్లో కొంత జాప్యం జరిగింది. సెబ్‌ని రద్దు చేయడం వల్ల మాతృశాఖ అయిన ఎక్సైజ్‌కి జిల్లాలో 80 మంది వెనక్కి వచ్చారు. ఎక్సైజ్‌లో పూర్తి స్థాయిలో బదిలీలు జరగాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఇప్పుడు ఆ శాఖ అధికారులు, సిబ్బంది 'దారు'ల వెతుకులాటలో పడ్డారు. ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారని తెలుస్తోంది. పోలీసు శాఖలోని తమకు పరిచయం ఉన్నవారు, స్నేహితుల నుంచి 'రేటు' ఎంతో సేకరించి ఆ దిశగా వెళుతున్నారని సమాచారం.



ఉచిత ఇసుక సరఫరాకు

పకడ్బందీ ప్లాన్

రవాణా చార్జీల నిర్ణయం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఉచిత ఇసుక పథకాన్ని పకడ్బందీగా అమలుచేయడానికి ప్రణాళికను సిద్ధంచేసింది. కేవలం ఇసుకతీత, ఎగుమతి, పరిపాలనాపరమైన చార్జీలు, రవాణా చార్జీలతోనే ఇసుకను లబ్ధిదారులకు చేరేలా చేయడం ప్రభుత్వ లక్ష్యం. ఇసుక తవ్వకం, లోడింగ్ రూ.30, రీలోడింగ్‌కు రూ.30, సీనరేజి రూ.66, జీఎస్టీ 18శాతం, డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ (డీఎంఎఫ్) రూ.19.68, మెరిట్ (ఖనిజాన్వేషణ నిధి) 2 శాతం వసూలుచేస్తారు. ఇవికాకుండా లబ్ధిదారుడు రవాణా చార్జీలు పెట్టుకోవాలి. ఇక ర్యాంపుల్లో ఒక పైసా కూడా అదనంగా తీసుకోవడానికి వీలులేదు. కానీ కొందరు రవాణా చార్జీల పేరిట ఎక్కువ వసూలు చేస్తున్నట్టు స్టాక్ పాయింట్లలో తేలడంతో రవాణాచార్జీలను ప్రభుత్వమే నిర్ణయిస్తూ జీవో జారీచేసింది. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారమే ఇసుక రవాణాచేసే వాహనదారులు ఇసుకను సరఫరా చేయాలి. ఇసుక ర్యాంపు నుంచి 10 కిలోమీటర్ల వరకూ 4.5 టన్నుల ట్రాక్టర్‌కు రూ.13.5 రవాణా చార్జీ నిర్ణయించారు. తర్వాత 11 నుంచి 20కిలోమీటర్ల వరకూ రూ.12.8, 21 నుంచి 30 కిలోమీటర్ల వరకూ రూ.12.8, 31నుంచి 40 వరకూ రూ.12.8, 40 నుంచి 80 కిలోమీటర్ల వరకూ రూ.6.3 మాత్రమే వసూలు చేయాల్సి ఉంది. 10 టన్నుల ఇసుక తీసుకుని వెళ్లే ఆరు టైర్ల ట్రక్కుకు ఇసుక పాయింట్ నుంచి 10 కిలోమీటర్ల రూ.10.7, తర్వాత 11 నుంచి 20 కిలోమీటర్ల వరకూ రూ.10.2 తర్వాత 21 నుంచి 30 కిలోమీటర్ల వరకూ 10.2 రూపాయలు, 31 నుంచి 40 వరకూ రూ.10.2, తర్వాత 40 నుంచి 80 కిలోమీటర్ల వరకూ రూ 6.3, వసూలు చేయాలి. 10, 12, 14 టైర్ల లారీలు 18 టన్నులు ఇసుక తీసుకుని వెళ్లినా, 20 టన్నులు, 25 టన్నులు, 30 టన్నులు, 35 టన్నుల ఇసుక తీసుకుని వెళ్లినా పాయింట్ నుంచి 10 కిలోమీటర్ల వరకూ కిలోమీటరు రూ.9.4, తర్వాత 11 నుంచి 20 కిలోమీటర్ల వరకూ రూ.8.9, 21 నుంచి 30 కిలోమీటర్ల వరకూ రూ.8.9, 31 నుంచి 40 కిలోమీటర్ల వరకూ రూ.8.9, 40 నుంచి 80 కిలోమీటర్ల వరకూ రూ.6.3 వసూలు చేయాల్సి ఉంటుంది. ఇక 80 కిలోమీటర్లకంటే ఎక్కువ దూరం ఉంటే కిలోమీటరుకు రూ.35 అదనంగా వసూలు చేయవచ్చని నిర్ణయించారు. ఇవన్నీ సక్రమంగా అమలైతే చాలా తక్కువకే ఇసుక వినియోగదారుడికి అందుతుంది. ఇంతవరకూ వరదల వల్ల ఇసుకతీత ఆగింది. నెమ్మదిగా వరద లాగేస్తోంది కాబట్టి త్వరగానే ఇసుకతీత మొదలుకానుంది.



బాణసంచా పేలి 17 మందికి గాయాలు

ఇద్దరి పరిస్థితి విషమం

అమలాపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణ ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పట్టణంలోని రావుల చెరువులో సోమవారం ఉదయం 9.45 గంటలకు బాణసంచా తయారు చేస్తున్న ఓ ఇల్లు పేలుడు ధాటికి తునాతునకలై కుప్పకూలిపోయింది. పక్కనే ఉన్న ఇల్లు కూడా ధ్వంసమైంది. విస్ఫోటనంలో గొవ్వాల నాగేశ్వరరావు, గొవ్వాల సుభద్రమ్మలకు చెందిన ఇల్లు పూర్తిగా ధ్వంసమైనట్టు రెవెన్యూ అధికారులు రికార్డు చేశారు. వాటితోపాటు సమీపంలోని పలు ఇళ్లు స్వల్పంగా దెబ్బతిన్నాయి. పలు చోట్ల టీవీలు ధ్వంసమయ్యాయి ఈ ఘటనలో మొత్తం 17మంది గాయపడగా, తొమ్మిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. బాణసంచా తయారు చేస్తున్న గొవ్వాల నాగేశ్వరరావు పరిస్థితి విషమంగా ఉంది. ఆయన భార్య నాగలక్ష్మి (55) తలకు బలమైన గాయంకావడంతో మంగళవారం ఉదయం శస్త్రచికిత్స నిర్వహించనున్నారు.



రాజమహేంద్రవరం సరికొత్తగా!

కొత్త మాస్టర్ ప్లాన్‌తో రహదారుల విస్తరణ

2027 పుష్కరాల నాటికి మహానగరంగా తీర్చిదిద్దే యోచన

ఏ నగరం అభివృద్ధి చెందాలన్నా ముందుచూపుతో తీసుకునే నిర్ణయాలే ఆధారమవుతాయి. సరైన ప్రణాళిక ఉంటేనే ఆ నగరం అందంగా, శుభ్రతకు మారుపేరుగా నిలుస్తుంది. అప్పటికప్పుడు తీసుకునే నిర్ణయాలతో అభివృద్ధి చేసుకుంటూపోతే నిష్ప్రయోజనమే. అందుకే పట్టణాలు, నగరాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ చాలా కీలకం. ఇప్పుడు చారిత్రాత్మక రాజమహేంద్రవరానికి నూతన రూపం తీసుకువచ్చేందుకు అధికార యంత్రాంగం ఈ దిశగా సన్నద్ధమవుతోంది. రాజమహేంద్రవరం నగరం వైశాల్యం 44.5 స్క్వేర్ కి.మీగా ఉంది. 50 డివిజన్లలు, సుమారు 5 లక్షల మంది జనాభా, 600 కిలోమీటర్ల డ్రైనేజీ వ్యవస్థతో మహానగరంగా రాజమహేంద్రవరం ఉంది. చారిత్రక ప్రదేశాలను పరిరక్షిస్తూనే నగరాన్ని మరింత విస్తరించి మహానగరంగా మార్చే ఆలోచనకు అధికారులు కార్యరూపం దాల్చే ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు.

(రాజమహేంద్రవరం సిటీ)

తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కేంద్రంగా ఉన్న రాజమహేంద్రవరం ప్రధానంగా వాణిజ్య నగరం. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలకు రాజమహేంద్రవరం ముఖ్య నగరం కూడా. అటు విజయవాడ, ఇటు విశాఖపట్నం నగరాలకు మధ్యలో ఉన్న రాజమహేంద్రవరం అభివృద్ధిలో ముందుకు దూసుకుపోయే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. చట్టుపక్కల సుమారు 15 గ్రామాలను నగరంలో విలీనం చేసి నగర విస్తరణను పెంచుతూ రాజమహేంద్రవరానికి మరింత శోభ వచ్చే విధంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ దిశగా రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగాన్ని కమిషనర్ కేతన్ గార్గ్ సన్నద్ధం చేశారు. ఇందులో భాగంగా రాజమహేంద్రవరానికి 2017లో రూపొందించిన నూతన మాస్టర్ ప్లాన్‌ను టౌన్ ప్లానింగ్ అధికారులు అమలుచేయబోతున్నారు. ఈ ప్లాన్ ప్రకారం నగరంలో చాలా రహదారులు వెడల్పుచేయాల్సి ఉంది. గత ప్రతిపాదనలతోపాటు కొత్తగా అనేక రహదారులను అభివృద్ధి చేసేందుకు అధికారులు సిద్ధమతున్నారు. నగరంలో ఆలకట్ గార్డెన్స్, ఈస్ట్ రైల్వేస్టేషన్ మొదలుకొని దానికి అనుసంధానంగా ఉన్న రహదారులన్నీ వెడల్పుచేసి అభివృద్ధి చేసే ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. అదేవిధంగా జాతీయ రహదారి నుంచి రాజమహేంద్రవరంలోకి వచ్చే అన్ని ప్రధాన రహదారులను విస్తరించబోతున్నారు.

● తూర్పు రైల్వేస్టేషన్ నుంచి..

రాజమహేంద్రవరంలో ప్రధాన రైల్వేస్టేషన్ నగరానికి పడమర వైపు ముఖంగా ఉంది. తూర్పువైపున ఉన్న ఈస్ట్ రైల్వే స్టేషన్‌ను మరింతగా అభివృద్ధి చేయడంలో భాగంగా సుమారు రూ.270 కోట్లు కేంద్ర ప్రభుత్వ రైల్వే నిధులతో రాజమహేంద్రవరం రైల్వేష్టేషన్ రూపురేఖలు మార్చబోతున్నారు. తూర్పు నుంచి ఈ స్టేషన్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తే దానికి అవసరమైయ్యే రహదారులను నిర్మించేందుకు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్లను వెడల్పుచేసి వాటిని జాతీయ రహదారికి, నగరంలోకి అనుసంధానం చేసేందుకు రహదారుల విస్తరణ చేయబోతోంది. ఆలకట్ గార్డెన్స్ నుంచి పేపరు మిల్లు వరకు ఆయా రహదారులను వెడల్పు చేయబోతోంది.

● 2027 పుష్కరాల నాటికి తీర్చిదిద్దేలా..

ప్రతి 12 ఏళ్లకు ఒకసారి వచ్చే గోదావరి పుష్కరాలకు రాజమహేంద్రవరాన్ని మరింతగా అభివృద్ధి చేసి మహానగరంగా తీర్చిదిద్దే ఆలోచనతో అధికారులు ముందుకు సాగుతున్నారు. నగరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, రహదారులు, ట్రాఫిక్ నియంత్రణ, దేవాలయాల సముదాయాల అభివృద్ధి, పర్యాటక అభివృద్ధి.. ఇలా అన్నింటిని దృష్టిలో పెట్టుకుని 2027 నాటికి రాజమహేంద్రవరాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. నూతన మాస్టర్ ప్లాన్ ప్రకారం ప్రతీ కూడలి, ప్రతీ రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థను విస్తరిస్తూ అభివృద్ధిపరచాలని భావిస్తున్నారు. ముఖ్యంగా అంతర్గత రహదారులు వెడల్పు చేయాలని, నగరంలో విపరీతంగా పెరిగిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేవిధంగా ఆక్రమణలు తొలగించాలని నిర్ణయించారు.

● 2017 మాస్టర్ ప్లాన్ ప్రకారం రహదారుల వెడల్పు

రాజమహేంద్రవరం నగరంలో 2017లో రూపొందించిన నూతన మాస్టర్ ప్లాన్ ప్రకారం నగరంలో రహదారులు వెడల్పు చేసేందుకు అప్రూవల్ తీసుకోవాలి. అందుకు సన్నద్ధమవుతున్నాం. అటు ఆల్కాట్ గార్డెన్స్ మొదలుకొని ఈస్ట్ స్టేషన్, బాలాజీపేట రోడ్డు, జాతీయ రహదారికి ఇటు ఆవ రోడ్డు మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు, మునిసిపల్ స్టేడియం రోడ్డు, గోదావరి రేవులకు వెళ్లే ప్రతి రహదారులను వెడల్పుచేస్తాం. పేపరుమిల్లు వరకు ఈ రహదారులు విస్తరణ ఉంటుంది. 40 అడుగులు, 60 అడుగులు, 80 అడుగులు రహదారుల వెడల్పుల పనులు ప్రభుత్వ అనుమతులతో పూర్తి చేయాల్సి ఉంది.

\- జీవీఎస్ఎన్ మూర్తి, సిటీ ప్లానర్, రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ

పోలవరం ప్రాజెక్టుపై మరో శ్వేతపత్రం విడుదల చేయాలి

అక్టోబరు 3న గ్రామసభలు నిర్వహించాలి

ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారు అయినాపురపు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 16: పోలవరం ప్రాజెక్టు అంచనాలు పెరిగిన నేపథ్యంలో సీఎం చంద్రబాబు మరో శ్వేతపత్రం విడుదలచేయాలని ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారులు అయినాపురపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2020 ఫిబ్రవరి 29న పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు చీఫ్ఇంజనీర్ బి.సుధాకర్‌బాబు కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో ఎస్టీలు 56,495, ఎస్సీలు 7,134, ఓబీసీలు 34,266, ఓసీలు 7706 కలిపి మొత్తం 10560 కుటుంబాల నిర్వాసితులు అవుతున్నారన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి వ్యక్తి ఒక కుంటుంబంగా కొత్త భూసేకరణ చట్టం పేర్కొందని, 2024 నాటికి 14 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి ఇప్పుడు 18 ఏళ్లు పూర్తిచేసుకుని కుటుంబంగా పరిగణించబడతారని తెలిపారు. కానీ సీఎం చంద్రబాబు విడుదల చేసిన శ్వేతపత్రంలో నిర్వాసితుల సంఖ్య 96,660గా వెల్లడించారని అంటే 10 వేల కుటుంబాలను తగ్గించి చూపించారన్నారు. అక్టోబరు 3న పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ముంపు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని కోరారు.

నేడు అల్‌బెండాజోల్ మాత్రల పంపిణీ

కొవ్వూరు, సెప్టెంబరు 16: జాతీయ నులి పురుగుల నివారణ దినం సందర్భంగా 1నుంచి 19 ఏళ్లలోపు బాలబాలికలకు ఈ నెల 17న అల్‌బెండాజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్టు కొవ్వూరు అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి టి.సుష్మ తెలిపారు. అర్బన్ ఏరియాలో 19ఏళ్లలోపు వయసున్న పిల్లలు 10,816 మందిని గుర్తించామన్నారు. అలాగే దొమ్మేరు పీహెచ్‌సీ పరిధిలో 19 ఏళ్లలోపు 5381 మందికి ఆల్‌బెండాజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్టు డాక్టర్ ఎస్.ధర్మరాజు తెలిపారు. 17న తీసుకోని వారికి ఈ నెల 25న పంపిణీ చేస్తామన్నారు. పిల్లలు, కిశోర బాలికల కడుపులో నులి పురుగులు ఉంటే పోషకాహారం లోపం, రక్తహీనత బారిన పడతారని, శారీరక, మానసిక ఎదుగుదల లోపిస్తుందన్నారు. ప్రతిఒక్కరూ తమ పిల్లలకు నులి పురుగుల నివారణకు అల్‌బెండాజోల్ మాత్రలు మింగించాలన్నారు.

మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్‌గా శ్యామ్



కొవ్వూరు, సెప్టెంబరు 16: మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్‌గా కొవ్వూరుకు చెందిన బొంతా శ్యామ్ రవిప్రకాష్ నియమితులయ్యారు. ఈ నెల 15న విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో తుమ్మల ఫ్రాన్సిస్ అధ్యక్షతన జరిగిన మాల సంఘాల జేఏసీ సమావేశంలో ఈ నియామకం జరిగినట్టు సోమవారం ఓ ప్రకటనలో శ్యామ్ తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నామని, మంద కృష్ణ మాలలపై, అంబేడ్కర్‌పై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొడతామని పేర్కొన్నారు.

నేటి నుంచి స్వచ్ఛత హీ సేవా

కొవ్వూరు, సెప్టెంబరు 16: కొవ్వూరు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.సుశీల తెలిపారు. కార్యక్రమాల్లో గ్రామ సచివాలయ కార్యదర్శులు, వివిధ శాఖాధిపతులు, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, వెలుగు సిబ్బంది పాల్గొనాలని ఆదేశించారు. అలసత్వం వహించిన సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థి వైద్యానికి ఆర్థిక సాయం

తాళ్లపూడి, సెప్టెంబరు 16: మండలంలోని పెద్దేవం శివారు చిడిపి గ్రామంలో కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న పదో తరగతి విద్యార్థి బట్టు రాజవర్ధన్‌కు వైద్యఖర్చుల నిమిత్తం మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో రూ.16,500 అందించినట్టు సంస్థ అధ్యక్షుడు అంకెం సురేష్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో జోడాల వెంకటేశ్వరరావు, సనపల రాజశేఖర్, వి.చంద్రయ్య, పాలడుగుల లక్ష్మణరావు, అప్పన హనుమంతరావు, ఆబేద్నిగో, చెరుకు ఆంజనేయులు పాల్గొన్నారు.

కొవ్వూరులో ఉచిత వైద్య శిబిరం



వైద్యులను సత్కరిస్తున్న నిర్వాహకులు

కొవ్వూరు, సెప్టెంబరు 16: కొవ్వూరుకు చెందిన లైటన్ ఆఫ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సోమవారం లైటన్ ఆఫ్ మినిస్ట్రీస్ ఫౌండర్, చైర్మన్ జె.శేఖర్‌బాబు ఆధ్వర్యంలో కళ్లేపల్లి కోటేశ్వరరావు, ప్రవీణల ఆర్థిక సహకారంతో దొండపూడి జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో జరిగిన ఈ శిబిరంలో సుమారు 300 మందికి డాక్టర్లు సౌమ్య బాబు వేణుగోపాల్, శ్రీనివాసరావు, సతీష్‌లు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రేమ్‌సాగర్, అశోక్, సువర్ణరాజు, ఇస్సాక్, హోలి ఏంజిల్స్ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పొగాకు కొనుగోళ్ల ముగింపు

గోపాలపురం, సెప్టెంబరు 16: వర్జీనియ పొగాకు కొనుగోళ్లు ఈ నెల 18వ తేదీతో ముగియనున్నట్టు వేలం నిర్వహణాధికారి అమల్‌శ్యామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది మార్చి 6న ప్రారంభమైన పొగాకు కొనుగోళ్లు సుమారు 125రోజుల పాటు నిర్విరామంగా జరిగాయన్నారు. రైతులు తమ వద్ద మిగిలిన పొగాకును 18వ తేదీ లోపు వేలం కేంద్రానికి తరలించి విక్రయించుకోవాలన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ



నిడదవోలులో పవిత్ర ఊరేగింపు నిర్వహిస్తున్న ముస్లింలు

నిడదవోలు, సెప్టెంబరు 16: సమాజంలో మానవులందరూ సమానమేనని మహమ్మద్ ప్రవక్త సమాజానికి మంచి సందేశాన్ని అందించారని సీపీఎం నాయకుడు జువ్వల రాంబాబు అన్నారు. సోమవారం నిడదవోలులో ముస్లింలు మిలాద్ ఉన్ నబీ పండుగను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త సందేశాలు అందరికీ ఆచరణీయమని ఆయన సమాజానికి మంచి సందేశాన్ని అందించారన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. అనంతరం పట్టణ పురవీధుల్లో పవిత్ర ఊరేగింపు నిర్వహించారు.



కొవ్వూరు: స్థానిక మర్కజ్, జామియా మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇమామ్‌లు ప్రవక్త సందేశాలను వివరించారు.

నల్లజర్ల ఫొటోగ్రాఫర్ల నూతన కార్యవర్గం



నూతన కమిటీతో ప్రమాణాస్వీకారం చేయిస్తున్న జిల్లా అధ్యక్షుడు రాము

నల్లజర్ల, సెప్టెంబరు 16: ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మండల ప్రొఫెషనల్ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల అసోషియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. సోమవారం అచ్చన్నపాలెంలోని కాకర్ల గంగరాజు కళ్యాణ మండపంలో నూతన కార్యవర్గ సభ్యులతో ఫొటోగ్రాఫర్ సంఘ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా చైర్మన్ ఎం.రాము ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా యడ్లపల్లి నిరంజన్, గౌరవాధ్యక్షుడిగా వై.గాంధీ, ఉపాధ్యక్షుడిగా కలగర సుబ్బారావు, కార్యదర్శిగా కె.చంద్రరావు, కోశాధికారిగా డి.శ్రీనివాసరావు, సభ్యులుగా మరో ముగ్గురు ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా కెమెరా సృష్టికర్త డాగువేగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వరద ప్రాంతాల్లో వైద్య సేవలు



నల్లజర్ల, సెప్టెంబరు 16: విజయవాడ వరద ప్రాంతాల్లో ప్రజలకు వ్యాధులు ప్రబలకుండా ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలందిస్తున్నట్టు వైద్య ఉద్యోగుల సంఘం నాయకుడు జీవీవీ ప్రసాద్ తెలిపారు. నల్లజర్ల పీహెచ్‌సీ నుంచి వైద్య సిబ్బందితో తాను విజయవాడ వెళ్లి వైద్య సేవలందించడం, అక్కడి పరసరాల్లో నీరు నిల్వలు లేకుండా చూడడం, ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు.

బై..బై..గణేశా!

- ఘనంగా గణపతి ప్రతిమలు, విగ్రహాల నిమజ్జనం
- బాణసంచా కాల్పులు, సాంస్కృతి ప్రదర్శనలు
- వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు

కొవ్వూరు, సెప్టెంబరు 16: వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు కార్యక్రమం పలుచోట్ల ఘనంగా జరిగింది. గణపతి ప్రతిమలు, విగ్రహాలను భక్తులు బాణసంచా కాల్పులు, బ్యాండ్ మేళాలు, పలు రకాల వేషధారణలు, సాంస్కృతి ప్రదర్శనలు నడుమ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం కాలువలు, గోదావరిలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా కొవ్వూరులోని 10వ వార్డు రామాలయం వద్ద ఏర్పాటుచేసిన వినాయకుని చేతిలోని 11 కిలోల లడ్డూకు వేలం నిర్వహించారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిక్కి నాగేంద్ర రూ.21 వేలకు దక్కించుకున్నారు. అనంతరం భారీ అన్నదానం చేశారు. పట్టణంలోని వివిధ కూడళ్లలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి గోష్పాదక్షేత్రం వద్ద గోదావరిలో నిమజ్జనం చేశారు.

తాళ్లపూడి: స్థానిక ఆర్యవైశ్య సంఘం యువకుల ఆధ్వర్యంలో నిలిపిన గణపతిని వ్యానుపై ఊరేగింపుగా తీసుకెళ్లి గోదావరిలో నిమజ్జనం చేశారు. అలాగే పలు గ్రామాల్లోని వినాయక ప్రతిమలు, విగ్రహాలను తాళ్లపూడి, ప్రక్కిలంక, వేగేశ్వరపురంలోని గోదావరి రేవుల్లో నిమజ్జనం చేశారు.

చాగల్లు: చాగల్లులో తెలగా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామి వారి విగ్రహాన్ని ఉంచి భారీ ఎత్తున బాణసంచా కాల్పులు, డప్పు వాయిద్యాలు, విచిత్ర వేషధారణలతో ఊరేగించారు. భక్తుల దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గండ్రోతు సురేంద్రకుమార్, తెలగా సంఘం యువకులు, కమిటీ సభ్యులు ఊరేగింపులో పాల్గొన్నారు. అంతకుముందు శ్రీగణపతి నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా ఆదివారం రాత్రి తెలగా సంఘం కళావేదికపై రోషన్‌లాల్ ఆర్కెస్ట్రా యువతను విశేషంగా ఆకట్టుకుంది. సినీ గాయని సత్య యామిని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అలాగే చాగల్లు, నెలటూరు వర్తక సంఘం కళావేదికపై కురుక్షేత్రం పౌరాణిక నాటకం ప్రదర్శించారు. కృష్ణుడిగా గుమ్మడి గోపాలకృష్ణ, ఎ.కోటేశ్వరరావు సహా పలువురు రంగ స్థల నటులు తమ నటన, గాన మాధుర్యంతో శ్రోతలను రంజింపజేశారు.

మసి వేషం ప్రత్యేకం

తెలగా సంఘం వినాయకుడి ఊరేగింపులో మసి వేషధారణ ప్రత్యేకత సంతరించుకుంది. తమ కోరికలు నెరవేరాలని కోరుతూ భక్తులు మసివేషం వేసి ఊరేగింపులో పాల్గొంటా మొక్కుకుంటారు. అనంతరం మొక్కులు తీర్చుకోవడం కోసం ఊరేగింపు రోజు శరీరం అంత మసి పూసుకుని నల్లని దుస్తులు ధరించి గ్రామంలో జరిగే ఊరేగింపులో చివరి వరకు పాల్గొంటారు. డిబ్బి చేతబట్టుకుని చందాలు వసూలు చేస్తారు. దర్శకుడు వీవీ వినాయక్ సహా పలువురు ఈవిధంగా మసి వేషం వేసిన సందర్భాలు ఉన్నాయి.

నల్లజర్ల: పోతవరంలో బాల వినాయక ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. అనంతరం స్వామి వారి లడ్డూను వేలం వేయగా గ్రామస్థుడు అబ్బూరి నరేష్ రూ.13,500కు దక్కించుకుని, అక్కడే ఉన్న భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు



చాగల్లులో తెలగా సంఘం వినాయకుడి ఊరేగింపు



ఒంటికి మసి పూసుకుని నల్లని దుస్తుల్లో యువకుల ఊరేగింపు



కొవ్వూరులో వినాయకుని లడ్డూని ఊరేగిస్తున్న భక్తులు



తాళ్లపూడిలో గణపతిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న ఆర్యవైశ్య సభ్యులు



వర్తక సంఘం కళావేదికపై కురుక్షేత్రం నాటకంలోని ఒక సన్నివేశం

20న కొవ్వూరు మండల పరిషత్ సమావేశం

కొవ్వూరు, సెప్టెంబరు 16: కొవ్వూరు మండల పరిషత్ సమావేశం ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.సుశీల తెలిపారు. వివిధ గ్రామాల్లో చేపట్టనున్న అభివృద్ధి అంశాలపై ఎంపీపీ కాకర్ల నారాయుడు అధ్యక్షతన చర్చించనున్నట్టు చెప్పారు. ఈ సమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

నేటికీ అసంపూర్ణమే!

- నిర్మాణం పూర్తి కాని పాఠశాల భవనాలు
- నిధులు మంజూరు కాక నిలిచిపోయిన నిర్మాణాలు



గోపాలపురం జడ్పీ హైస్కూల్లో నిలిచిపోయిన అదనపు గదుల నిర్మాణం

గోపాలపురం, సెప్టెంబరు 16: నాటి ప్రభుత్వం ఆర్భాటంగా నాడు-నేడు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు అనే లక్ష్యం నీరుగారిపోయింది. అదనపు తరగతి గదుల నిర్మాణాలకు సరిపడ నిధులు మంజూరు చేయకపోవడంతో ఆ నిర్మాణాలు ప్రస్తుతం మొండిగోడలతో అసంపూర్తిగా మిగిలిపోయాయి. కోట్లాది రూపాయలు కేటాయించిన నిర్మాణాలకు సరిపడ నిధులు మంజూరు చేయకపోవడంతో గత ఏడాది చేపట్టిన అదనపు గదుల నిర్మాణాలు నేడు మొండి గోడలుగా దర్శనమిస్తున్నాయి. ఫలితంగా విద్యార్థులు తరగతి గదులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడంతో ఆ బాధ్యతలను తీసుకున్న పేరెంట్స్ కమిటీ సభ్యులు నిర్మాణాలు పూర్తి చేయలేక చతికిల పడ్డారు. గోపాలపురం జడ్పీ హైస్కూల్, వాదాలకుంట జడ్పీ హైస్కూల్, కరిచర్లగూడెం ప్రాథమిక పాఠశాల, నందిగూడెం ప్రాథమిక పాఠశాల, రామ్‌పాలెం ప్రాథమికోన్నత పాఠశాల, రాజంపాలెం జడ్పీ హైస్కూళ్లలో 2023లో గత ప్రభుత్వం రెండో విడతలో పాఠశాలలను సర్వశిక్ష అభియాన్‌లో భాగంగా నాడు-నేడు పేరుతో ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతామని ప్రకటనలు గుప్పించింది. ఉన్న పాఠశాలలు పడగొట్టడం చకచక జరిగిపోయాయి. అయితే అదనపు తరగతి గదుల నిర్మాణాలకు నిధులు మంజూరు కాకపోవడంతో ఆ నిర్మాణాలు ఇప్పటికీ అసంపూర్తిగా మిగిలిపోయాయి.

మూడు నెలలకోసారి వైద్య శిబిరాలు

- ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు



యర్నగూడెంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి

దేవరపల్లి, సెప్టెంబరు 16: నియోజకవర్గంలోని ప్రతీ మండలంలో మూడు నెలలకు ఒకసారి వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని యర్నగూడెంలో ఆర్.కన్వెన్షన్ హాలులో సోమవారం నిర్వహించిన ఉచితవైద్య శిబిరంతో పాటు రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మద్దిపాటి మాట్లాడుతూ టీడీపీ నాయకుడు పెనుమత్స సుబ్బరాజు జన్మదినం సందర్భంగా యన్నగూడెంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ వైద్యశిబిరాన్ని రెండు రోజులు నిర్వహిస్తారని అందరికి వైద్యసేవలందించడానికి అవకాశం ఉంటుందన్నారు. నియోజకవర్గంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణంపై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి ఏర్పాటు చేస్తామన్నారు. ఈ శిబిరంలో రాజమహేంద్రవరం జీఎస్ఎల్ ఆసుపత్రి వైద్యులు 16 మంది వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.రక్తదానం చేసిన యువకులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఇదిలా ఉండగా యాదవోలులో వినాయకుడి ఆలయం వద్ద లక్ష్మీగణపతి హోమం, వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భారీ ఊరేగింపు, అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల అధ్యక్షులు ఆండ్రూ అనీల్, రొంగలి సత్యనారాయణ, తాతిన సత్యనారాయణ, నాయకులు గుమ్మడి సత్యనారాయణ, కొయ్యలమూడి చిన బాబు, సుంకర దుర్గారావు, గద్దే శ్రీనివాస్, బొల్లిన భాస్కర్, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు రామసత్యనారాయణ, జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకుడు వెలగా శ్రీరామమూర్తి, బళ్లా సూర్యచక్రం పాల్గొన్నారు.

కమిషనర్ ఉత్తర్వులను పున:పరిశీలించాలని రేషన్ డీలర్ల వినతి

నల్లజర్ల, సెప్టెంబరు 16: మండలంలోని 400 కార్డులకు రేషన్‌షాపు మంజూరు అని కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులను ప్రభుత్వం పున:పరిశీలించాలని మండలంలోని రేషన్ డీలర్లు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుకు వినతి పత్రం అందించారు. సోమవారం నల్లజర్ల టీడీపీ కార్యాలయంలో మద్దిపాటికి తమ సమస్యలను వివరించారు. డీలర్ల సంఘం అధ్యక్షుడు నరసింహమూర్తి మాట్లాడుతూ 700 రేషన్ కార్డులు ఉంటే డీలర్లకు షాపు అద్దె, కరెంటు బిల్లు, స్టేషనరీ ఖర్చు, వేయింగ్ కాటా, ఈ-పోస్ రిపేర్లు ఖర్చులు పోయి నెలకు రూ.8వేలు ఆదాయం ఉంటుందని వాపోయారు. 400 కార్డులకు షాపు కేటాయించడం ద్వారా ఈ ఆదాయం మరింత తగ్గిపోతుందని, దీని వల్ల డీలర్ల బతుకులు భారంగా మారుతాయన్నారు. ప్రభుత్వ నూతన పాలసీ ద్వారా డీలర్ల కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. నూతన పాలసీ ద్వారా 20 పైసలు కమీషన్ మాత్రమే వస్తుందన్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి ప్రభుత్వానికి సమస్యలను తెలియజేస్తానన్నారు. కార్యక్రమంలో కొండేపాటి శేషగిరి, లక్ష్మణరావు, అచ్యుత భాస్కరరావు, మహేశ్, వెంకన్న పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మద్దిపాటికి వినతిపత్రం అందజేస్తున్న మండల రేషన్ డీలర్లు

పోరాటయోధుడు సీతారామ్ ఏచూరి

విశ్రాంత ఉద్యోగుల సంఘ మండలాధ్యక్షుడు సత్యం

నల్లజర్ల, సెప్టెంబరు 16: దివంగత సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి పోరాటయోధుడని విశ్రాంత ఉద్యోగుల సంఘ మండలాధ్యక్షుడు ఐవీ సత్యం అన్నారు. సోమవారం నల్లజర్ల హైస్కూల్లో జరిగిన విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో ముందుగా సీతారామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ ఏచూరి విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలతో చురుకుగా ఉండే వారని, అంచెలంచెలుగా ఎదిగి సీపీఎం అగ్రనేతగా రాణించారన్నారు. ఆయన నిరంతరం కార్మిక, కర్షకుల ప్రయోజనాల కోసం పోరాటం సాగించారన్నారు. కార్యక్రమంలో ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, ఎస్ఎం అలీసాహెబ్, ఏసురత్నం, ప్రభుదాసు, ఎన్.రాజేంద్రప్రసాద్, బాలయ్య పాల్గొన్నారు.

బైక్ చోరీలకు పాల్పడ్డ నలుగురు మైనర్ల అరెస్టు

10 ద్విచక్రవాహనాల స్వాధీనం

కడియం, సెప్టెంబరు 16: మోటారుసైకిళ్ల చోరీ కేసులో నలుగురు మైనర్లను అరెస్టు చేసినట్టు డీఎస్పీ భవ్యకిషోర్ తెలిపారు. సోమవారం కడియం పోలీస్‌స్టేషన్‌లో ఆమె వివరాలు వెల్లడించారు. కడియం మండలంలో ఇటీవల జరుగుతున్న మోటారు సైకిళ్ల వరుస దొంగతనాలపై ప్రత్యేక పోలీసుబృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఎస్ఐ నాగదుర్గాప్రసాద్‌కు వచ్చిన సమాచారం మేరకు పోలీసుసిబ్బందితో చైతన్యనగర్ శివారు దొండుబాబు ఆలయం వద్దకు వెళ్లగా నలుగురు మైనర్లు మోటారుసైకిళ్లపై అనుమానాస్పదంగా తిరుగుతుండగా వారిని విచారించారు. బైక్‌ల పత్రాలు పరిశీలించగా అవి దొంగతనానికి గురైన బైక్‌లుగా గుర్తించామన్నారు. వారిని కడియం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పందలపాక, మామిడాడ గ్రామాలకు చెందిన కొంతమంది బృందంగా ఏర్పడి కడియం, రాజానగరం, పెరవలి, పెద్దాపురం, సర్పవరం, రాజమహేంద్రవరం, యానాం పరిధిలో 10 ద్విచక్రవాహనాలు చోరీ చేసినట్టు గుర్తించామన్నారు. అదుపులోకి తీసుకున్న నలుగురు మైనర్లపై కేసు నమోదు చేసి రాజమహేంద్రవరం కోర్టుకు హాజరు పరుస్తున్నట్టు తెలిపారు.

వరద బాధితులకు నిత్యావసరాల సేకరణ

దేవరపల్లి, సెప్టెంబరు 16: విజయవాడ వరద బాధితుల కోసం జనసేన ఆధ్వర్యంలో మండలంలోని ఆయా గ్రామాల నుంచి సేకరించిన బియ్యం, నిత్యావసర వస్తువులను జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి సువర్ణరాజుకు దేవరపల్లి కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో కాట్నం గణేష్, చప్పటి శివనాగప్రసాద్, పసుపులేటి ప్రసాద్, అనిశెట్టి శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, దుగ్గిన లీలాగంగాధర్ నాయుడు, మధు పాల్గొన్నారు.

రేపటి నుంచి గోపాలపురం

నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు

దేవరపల్లి, సెప్టెంబరు 16: ఈ నెల 18వ తేదీ నుంచి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, 17 బాలబాలికలకు గోపాలపురం నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్స్, యోగా, చెస్, షెటిల్, బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు దేవరపల్లి జడ్పీ స్కూల్లో నిర్వహించనున్నట్టు ఎంఈవోలు తిరుమలదాసు, అప్పారావు తెలిపారు. ఈ పోటీల్లో గోపాలపురం, నల్లజర్ల, దేవరపల్లి మండలాల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులు, వ్యాయమా ఉపాధ్యాయలు పాల్గొంటారని తెలిపారు. అలాగే దుద్దుకూరు జడ్పీ పాఠశాలలో ఖోఖో, కాబడ్డీ, వాలిబాల్, నియోజకవర్గ స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తామని చెప్పారు.

నేటి నుంచి మూడు రోజులపాటు

రాజమహేంద్రవరంలో ఎంపీ పురందేశ్వరి పర్యటన

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 16: రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మూడు రోజులపాటు పాల్గొనే కార్యక్రమాల వివరాలను ఎంపీ కార్యాలయం సోమవారం వెల్లడించింది. ఈనెల 17న ప్రధాని మోదీ పుట్టిన రోజు సందర్భంగా ఉదయం 10:30గంటలకు క్వారీ మార్కెట్ సెంటర్లోని అన్న క్యాంటీన్‌ను సందర్శిస్తారు. ఆ రోజున టిఫిన్, భోజనాలకు అయ్యే ఖర్చును భరిస్తారు. అనంతరం గౌతమీ నేత్రాలయానికి చేరుకుని పరికరాలు అందజేసే కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3గంటలకు రాజానగరంలోని అన్నదాన సత్రం కల్యాణ మండపంలో బీజేపీ సదస్యత అభియాన్ కార్యక్రమంలో పాల్గొంటారు. 18న విజయవాడలో జరిగే ఎన్‌డీఏ ఎంపీలు, ఎమ్మెల్యేల సమావేశంలో పాల్గొంటారు. 19వ తేదీ ఉదయం సినీ హాస్యనటుడు రేలంగి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటలకు రాజమహేంద్రవరం అంబేడ్కర్ వెల్ఫేర్ కమ్యూనిటీ అసోసియేషన్ హాలులో మొబైల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే సన్మాన కార్యక్రమంలో పాల్గొంటారు.

హోటల్స్ రెస్టారెంట్లపై ఫుడ్ కమిటీ తనిఖీలు

నిర్వాహకులకు నోటీసులు జారీ



రైల్వేస్టేషన్ సమీపంలో రెస్టారెంట్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 16: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పబ్లిక్ హెల్త్ విభాగం ఆధ్వర్యంలో కమిషనర్ కేతన్ గార్గ్ ఏర్పాటు చేసిన ఫుడ్ కమిటీలు హోటల్స్, రెస్టారెంట్‌లపై ఆకస్మిక తనిఖీలు చేపట్టాయి. సోమవారం నగరపాలక సంస్థ శానిటరీ సూపర్‌వైజర్, ఫుడ్ కమిటీ ఇన్‌చార్జి ఇంద్రగంటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఫుడ్ కమిటీ బృందం స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని పలు హోటల్స్, రెస్టారెంట్‌లను తనిఖీ చేసి వాటి వంటశాలలను, ఆహార నాణ్యతను పరిశీలించారు.అపరిశుభ్ర వాతావరణం, నాణ్యతా ప్రమాణాలు పాటించని వాటికి నోటీసులు ఇచ్చారు. 14 రోజుల లోపు దానికి తగిన సమాధానం చెప్పి పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీఎం సహాయ నిధికి విరాళాలు



ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుకు చెక్కును అందిస్తున్న గన్ని కృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 16: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావడం మానవతా దృక్పథానికి నిదర్శనమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. వరద బాధితుల సహాయార్థం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ సీఎం సహాయ నిధికి రూ.1లక్షను ఎమ్మెల్యే వాసుకు సోమవారం అందించారు. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛందంగా దాతలు ముందుకు వచ్చి సహాయం చేస్తే బాధితులకు మేలు జరుగుతుందని గన్ని అన్నారు. అలాగే సువిశేషపురం రక్షణాలయం సభ్యులు సమకూర్చిన రూ.1లక్ష చెక్కును సెయింట్ జన్ పారిస్ సభ్యులు మార్టిన్ లూథర్, జంగ సుబ్బారావు, తలారి రత్నరాజు, డి.భూషణరావు, రాచపల్లి ప్రసాద్ ఎమ్మెల్యేకు అందించారు. అలాగే అద్దేపల్లి మాధవి ఓంశాంతి వారు రూ.1లక్ష, జాంపేట దేవాంగ సంక్షేమ సంఘం రూ.34,505, మేకా పాపారావు రూ.10 వేలు అందించారు. కార్యక్రమాల్లో ఆర్.శ్యామ్, సుదాకర్, ఆర్.విజయకుమార్, వాసా వర్థిల్, రాచపల్లి మాణిక్యాలరావు పాల్గొన్నారు.

జాతీయ టీటీ పోటీల్లో రాజ్‌కుమార్‌కు కాంస్యం



రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 16: రాజమహేంద్రానికి చెందిన టేబుల్ టెన్నిస్ క్రీడాకారుడు జాతీయ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించాడు. స్థానిక గౌతమి టేబుల్ టెన్నిస్ అకాడమీ క్రీడాకారుడు సూరపురెడ్డి త్రిషాల్ రాజ్‌కుమార్ హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం కాంగ్రాలోని రెయిన్‌బో అకాడమీలో ఈ నెల 11నుంచి 18వరకు జరుగుతున్న యూటీటీ నేషనల్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ పోటీలలో అండర్-15 బాలుర విభాగంలో పాల్గొని సిల్వర్ మెడల్ సాధించాడు. విభజిత ఆంధ్రప్రదేశ్ నుంచి ఈ ఘనత సాధించిన మొట్టమొదటి క్రీడాకారుడిగా రాజ్‌కుమార్ నిలిచారని ఏపీటీటీఏ ఉపాధ్యక్షుడు, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు విశ్వనాధం భాస్కరరామ్ చెప్పారు. ఈ సందర్భంగా క్రీడాకారుడిని టీటీఏ జిల్లా అధ్యక్షుడు జేవీవీ అప్పారెడ్డి, కోశాధికారి కె.సత్యనారాయణ, కోచ్ పి.వేణుగోపాలరావు, వీటీవీ సుబ్బారావు, అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ స్క్రీన్1	సరిపోదా శనివారం
వై.స్క్రీన్2	డిమోంటి
దేవిశ్రీ(గాయత్రి	డబుల్ ఇస్మార్ట్
అనన్య	ఆయ్

నిడదవోలు

వీ మ్యాక్స్	సరిపోదా శనివారం
రాధాకృష్ణ	ది గోట్
శ్రీగణపతి	ఆయ్, కమిటీ కుర్రోళ్లు

దేవరపల్లి

శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	మిస్టర్ బచ్చన్
త్రినాథ్ సినీ మ్యాక్స్	డబుల్ ఇస్మార్ట్